ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 25.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 245 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

టీమిండియా ముందు భారీ లక్ష్యం! 12

రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో కొడంగల్ పిల్లలను భాగస్వామ్యం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. ఐదు వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మించుకుంటున్నామని, గొప్ప, గొప్ప చదువు చదవాలంటే కొడంగల్ వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. 16 నెలలు తిరిగే లోపు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. 2034 నాటికి దేశంలోనే ఒక ఆదర్శవంత శాసనసభ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. గడిచిన 70 యేండ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందని అన్నారు.

ఆడబిడ్డలు హాయిగా ఉండాలి

అప్పుడే రాష్ట్రం సమగ్రాభివృద్ధి

ఆర్థిక చేయూతకు సర్కారు శ్రీకారం

- వారి జీవితాలలలో వెలుగులు నింపడానికే
- విద్య, నీటి పారుదల రంగం అభివృద్ధే లక్ష్యం
- అక్షయపాత్ర ద్వారా అల్పాహారం, బడి అన్నం
- ఏ ఒక్క విద్యార్థీ ఎక్కడా ఆకలితో ఉండకూడదు
- ఎనిమిదేండ్లలో దేశానికే ఆదర్శంగా కొడంగల్
- పారిశ్రామికంగానూ దీనిని అభివృద్ధి చేస్తాం
- స్థానిక యువతకు ఉపాధి దొరికేలా ప్రణాళికలు
- నియోజకవర్గాన్ని ప్రయోగశాలగా ఎంచుకున్నాం
- కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- రూ.103 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధి

కొడంగల్, నవంబర్ 24: ఆడబిడ్డలు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసంతోనే వారిని ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మహిళల జీవితాలలో వెలుగులు నింపడానికి ప్రధానమైన విద్య, నీటి పారుదల రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుని పని చేస్తున్నదని తెలిపారు. అందుకు కొడంగల్ ను ఒక ప్రయోగశాలగా ఎంచుకున్నామని, వచ్చే ఎనిమిదేండ్లలో నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తన స్వంత నియోజకవర్గం కొడంగల్‌లో రూ.103 కోట్లతో వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేసారు. సంక్షేమ పథకాలకు సంబంధించి వివిధ లబ్దిదారులకు చెక్కులు, చీరలను పంపిణీ చేశారు. కొండగల్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సంబంధించిన ప్రణాళికలను ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ ఇంటిలో అమ్మ ఏ విధంగా ఆలోచిస్తుందో, అదే విధంగా 'అక్షయపాత్ర'

..:: మిగతా 2లో

వేటాడడం ఆపండి

ఆయుధాలను వదిలేస్తాం

15 ఫిబ్రవరి వరకు గడువు ఇవ్వండి

- కేవలం సమాచారం కొరకే సమయం
- దేశ కాలమాన పరిస్థితులను అర్థం చేసుకున్నాం
- సోను దాదా నిర్ణయాన్ని కూడా సమర్థిస్తున్నాం
- సతీశ్, చంద్రన్న కూడా ఆమోదించారు
- భద్రతాదళాల గాలింపు చర్యలను నిలిపేయండి
- పీఎల్జీఏ వారోత్సవాలను కూడా నిర్వహించబోం
- 3 రాష్ట్రాల సీఎంలకు మావోయిస్టుల బహిరంగ లేఖ
- ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట విడుదల

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

రాయ పుర (ఛత్తీస్ గఢ్), నవంబర్ 24 : 'ఆపరేషన్ కగార్'తో కకావికలం అవుతున్న మావోయిస్టులు చివరి ప్రయత్నంగా మరోసారి ఆయా ప్రభుత్వాలకు లేఖలు రాశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు తాత్కాలికంగా నిలిపివేస్తే, ఆయుధాలు వదిలేస్తామని కూడా ప్రతిపాదించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట విడుదలైన ఈ లేఖలో, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనూ, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ, తమ సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపేయాలని, ఆయుధాలు త్యజించాలని పార్టీ నాయకత్వం ఇటీవల తీర్మానించిందని లేఖలో తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ

..:: మిగతా 2లో

2027 జనాభా గణనకు కేంద్రం సిద్ధం

భారతదేశ జనాభా గణన 2027లో ప్రారంభం కాబోతున్నది. సర్వేయర్లంతా ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నారు. సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు సమాచారం కోరనున్నారు.

11

పాక్ పారా మిలిటరీ ఆఫీసుపై ఆత్మాహుతి దాడి

పాకిస్తాన్ లో ముష్కరులు రెచ్చిపోయారు. పెషావర్ లోని పాక్ పారామిలిటరీ ప్రధాన కార్యాలయంపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు కమాండోలు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

11

'హీ మ్యాన్' నో మోర్

బాలీవుడ్ హీరో 'ధర్మేంద్ర' కన్నుమూత

- అనారోగ్యంతో ఇంటిలోనే తుదిశ్వాస
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బాలీవుడ్ పరిశ్రమ
- సినీ ఇండస్ట్రీకి తీరని లోటన్న రాష్ట్రపతి ముర్ము
- నిరాడంబరత ఆదర్శనీయమని ప్రధాని నివాళి
- ముగిసిన దిగ్గజ నటుడి అంత్యక్రియలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

ముంబై, నవంబర్ 24: బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ ధర్మేంద్ర (89) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన ముంబైలోని తన నివాసంలో సోమవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల బాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతి

..:: మిగతా 2లో

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము
- 9 ఫిబ్రవరి 2027 వరకు పదవీకాలం
- తన సుదీర్ఘ కెరీర్ లో ఎన్నో కీలక తీర్పులు
- పదవి నుంచి తప్పుకున్న జస్టిస్ బీఆర్ గవాయి
- కొత్త సీజేఐకి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 24: దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జస్టిస్ సూర్యకాంత్‌తో సీజేఐగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. జస్టిస్ బీఆర్ గవాయి స్థానంలోనే ఇటీవల ఆయన సీజేఐగా నియమితులయ్యారు. 9 ఫిబ్రవరి 2027 వరకు పదవిలో కొనసాగుతారు. సుప్రీంకోర్టులో తన సుదీర్ఘ పదవీ కాలంలో ఆయన అనేక ముఖ్య, కీలక

..:: మిగతా 2లో

అకస్మాత్తుగా తగ్గిన బంగారం ధరలు

పసిడి ప్రియులకు ఈ సోమవారం పండుగలాంటిదే. బంగారం కొనాలని చూస్తున్నవారికి ఇది ఒక గొప్ప విషయమే. మార్కెట్లు తెరుచున్న వెంటనే బంగారం ధర భారీగా తగ్గింది.

11

ఇక డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్!

- కొత్త విధానం రూపొందించిన సర్కార్
- ఇండ్లు, ఖాళీ స్థలాలకు కూడా 'టైటిల్'
- 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'తో కఠిన నిబంధనలు
- కబ్జాలకు, రియల్ మోసాలకు తావుండదు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 24: తెలంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతిని అరికట్టేందుకు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇకపై ఇండ్లు, ఖాళీ స్థలాలకు కూడా వ్యవసాయ భూముల మాదిరిగా పక్కాగా 'యాజమాన్య హక్కు పత్రం' (టైటిల్) ఇవ్వాలని యోచిస్తోంది. ఈ వ్యవస్థలో 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని ప్రవేశపెట్టడం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల కబ్జాలను నివారించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే.. సర్వే నంబర్ బ్లాక్ విధానం ద్వారా లేఅవుట్ మోసాలను అడ్డుకోవాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇన్నాళ్లు వ్యవసాయ భూములకు మాత్రమే ఇస్తున్న 'పట్టా' (లేదా టైటిల్) విధానాన్ని ఇకపై ఇండ్లు, ఖాళీ స్థలాలకు కూడా వర్తింపజేయాలని యోచిస్తోంది. దీని ప్రకారం ఆస్తి యజమానుల పేరు మీద పక్కాగా 'యాజమాన్య హక్కు పత్రం' ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో తరుచూ వెలుగు చూస్తున్న అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్లు, అలాగే నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం వంటి సమస్యలను ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఆస్తి వివాదాలు కోర్టులకు ఎక్కుతుండటం, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఈ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్లాక్ చైన్ టెక్నాలజీ గొప్పతనం ఏంటంటే, ఒకసారి ఆస్తి వివరాలు ఇందులో నమోదైతే, వాటిని మార్చడం లేదా చెరిపివేయడం అసాధ్యం. ప్రభుత్వ భూముల కబ్జాలను నివారించడానికి

..:: మిగతా 2లో

మహిళల కబడ్డీ ప్రపంచ కప్ విజేత భారత్

- ఫైనల్ లో చైనీస్ తైపీపై ఘన విజయం
- అజేయంగా ఫైనల్ కు చేరుకున్న భారత జట్టు
- 35--28 తేడాతో చివరి పోరులో గెలుపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 24: భారత మహిళల కబడ్డీ జట్టు మరోసారి ప్రపంచ చాంపియన్ గా నిలిచింది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సోమవారం ఉత్కంఠభరితంగా సాగిన వరల్డ్ కప్ ఫైనల్‌లో 35-28 తేడాతో చైనీస్ తైపీపై ఘన విజయం సాధించింది. ప్రారంభం నుంచే భారత్ దూకుడుగా ఆడింది. మొదటి అర్ధభాగం ముగిసే సరికి

..:: మిగతా 2లో

అమెరికాలో భారత వస్తువులకే డిమాండ్

అమెరికాలో భారతీయ వస్తువులకు డిమాండ్ తగ్గుతుందని భావించారు. కానీ, ట్రంప్‌ను అమెరికన్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. మన వస్తువులనే అమెరికన్లు ఎక్కువగా నమ్ముతున్నారు.

11

రాజకీయం

తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వండి

- కేంద్ర కార్యదర్శికి మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : తెలంగాణలో గౌరవెల్లి సహా ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయికుమార్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కోఆర్డినేషన్ సెక్రెటరీ డా. గౌరవ్ ఉప్పల్‌తో కలిసి మంత్రి ఢిల్లీలో తన్మయికుమార్‌ను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం మే 2025లో ఇచ్చిన 'వనశక్తి' తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని, దీనిపై న్యాయసలహా తీసుకొని అనుమతుల మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పినట్టు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే.. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించామని మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాలలో ఉన్న కారణంగా తన్మయికుమార్‌ను కలిసి ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు చెప్పారు.

రాత్రిపూట పోలీసింగ్ మరింత బలోపేతం

- క్షేత్రస్థాయిలో సీపీ వీసీ సజ్జనార్ ఆకస్మిక పరిశీలన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : నగరంలో రాత్రిపూట పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని నగర సీపీ సజ్జనార్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది ఎలా స్పందిస్తున్నారనే విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆయన సౌత్ వెస్ట్ జోన్‌లో ఆకస్మిక పర్యటన చేశారు. రాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు లంగర్‌హౌస్, టోలీచౌకి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులు, కీలక ప్రాంతాలు, సున్నితమైన పాయింట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. రౌడీ షీటర్లను నిద్రలేపి, వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. మళ్లీ నేరాల వైపు అడుగులు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర ప్రవృత్తి వీడి సన్మార్గంలోకి రావాలని హితవు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోలింగ్ సిబ్బంది ఎంత మేరకు అప్రమత్తంగా ఉన్నారు, ప్రజల భద్రత కోసం వారు ఎలాంటి చర్యలు చేపడుతున్నారనే అంశాలను ఆరా తీశారు. త్వరితగతిన స్పందించే విధంగా పోలీసు బృందాలు సిద్ధంగా ఉండాలని సీపీ ఆదేశించారు.

శ్రీకృష్ణుడికి లేని కుల వివక్ష మీకెందుకు!?

- ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ
- ఎర్ర రాజశేఖర్ కుటుంబానికి పరామర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : హిందువుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణ భగవానుడు మాదిగ జాతికి చెందిన జాంబవంతుడి కుమార్తె జాంబవతిని వివాహమాడాడని, ఆ దేవుడికి లేని వివక్ష యాదవుడికి ఎందుకని ? ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ సంచలన వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఇటీవల ఎర్ర రాజశేఖర్ పరువు హత్యకు గురయ్యారు. రాజశేఖర్ దశదిన కర్మ సందర్భంగా ఎల్లంపల్లి గ్రామాన్ని మందకృష్ణ సందర్శించారు. రాజశేఖర్ సతీమణి ఎర్ర వాణి, అతడి తండ్రి ఎర్ర మల్లేశను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎర్ర రాజశేఖర్ సోదరుడు యాదవ యువతిని ప్రేమించిన కారణంగా యువతి తండ్రి వెంకటేశ్ అర్థం చేసుకోలేకపోయాడన్నారు. ఈ కుల వివక్షను రూపు మాపడానికి హిందూ ధర్మ రక్షకులు, సనాతన ధర్మాన్ని కాపాడేవారు ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. రాజశేఖర్ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపిన పోలీసులను అభినందించారు. వారికి కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో ఫోన్లో మాట్లాడారు. మంద కృష్ణ వెంట రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ, కాంగ్రెస్ దళిత విభాగం నాయకులు జంగారు రవి, బీఎస్పీ నేత దొడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



జర్నలిస్టుల చట్టాల రద్దు అప్రజాస్వామికం

- ఫెడరేషన్ నాయకులు రాంచందర్ బసవపున్నయ్య
- కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకునేంతవరకు కార్మికులు, జర్నలిస్టులు పోరాటం చేయాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ విద్యానగర్ కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఫెడరేషన్ అడ్ హాక్ కమిటీ కన్వీనర్ పి. రాంచందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను గాలికొదిలేసి కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం వ్యవరిస్తున్నదన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేయడం అన్యాయమని చెప్పారు. వెంటనే లేబర్ కోడ్ల నోటిఫికేషనన్ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను రద్దుచేయడాన్ని ఖండించారు. ఇప్పటికే అనేక సమస్యలతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారీ, కొత్త లేబర్ కోడ్లతో సమస్యలు జఠిలమవుతాయని అన్నారు. జర్నలిస్టులు ఇప్పటికే కోడ్లు విఘాతంగా మారాయని వ్యాఖ్యానించారు. అనంతరం సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ పృష్టికి ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

నేను కలిసి నటించిన హీరోల్లో రామ్‌తో వైబ్ కుదిరింది. తమ ఇద్దరిది ఒకే రాశి (వృషభం). నటిగా ప్రూవ్ చేసుకోవాల్సింది చాలా ఉంది. 'కాంత' మూవీలో రోల్ ఛాలెంజింగ్‌గా అనిపించింది. షూటింగ్ లేని సమయాల్లో ఎక్కువగా ఫ్యామిలీతో గడుపుతా. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి ట్రెక్కింగ్‌కు వెళ్తా.

- ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

ఆడబిడ్డలు హాయిగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి

సహకారంతో కొడంగల్ నియోజకవర్గంలోని 312 పాఠశాలలలో చదువుకుంటున్న 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం పెడుతున్నామని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థి కూడా ఆకలితో బాధ పడకూడదని, ఆకలితో చదువుపై శ్రద్ధ కోల్పోవద్దని దీనిని అమలు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెడుతున్నామని, కొడంగల్ ఎడ్యుకేషనల్ హబ్‌గా మారబోతున్నదని సీఎం వివరించారు. మెడికల్ కాలేజీ, వెటర్నరీ, వ్యవసాయ కాలేజీ, పారా మెడికల్, నర్సింగ్ కాలేజీ, ఫిజియో థెరఫీ, ఇంజనీరింగ్ కాలేజీ, ఏటీసీ, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు రాష్ట్రంలో ఇప్పటివరకు లేని సైనిక్ స్కూల్‌ను కొడంగల్‌లో ప్రారంభించుకోబోతున్నామని ప్రకటించారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో యువత

రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో కొడంగల్ పిల్లలను భాగస్వామ్యం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. ఐదు వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మించుకుంటున్నామని, గొప్ప, గొప్ప చదువు చదవాలంటే కొడంగల్ వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. 16 నెలలు తిరిగేలోపు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. 2034 నాటికి దేశంలోనే ఒక ఆదర్శవంత శాసనసభ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. గడిచిన 70 యేండ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందని అన్నారు. ఆనాడు కరువు ప్రాంతాలుగా ఉన్న కొడంగల్, మక్తల్, నారాయణపేట ప్రాంతాలను కృష్ణా నదీ జలాలతో తడపాలని, ప్రతి ఎకరాకు నీరివ్వాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించుకున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. మంగళవారం జరిగే మంత్రివర్గంలో ఆమోదం పొందితే మూడు నెలలలో పనులు ప్రారంభమవుతాయని సీఎం ప్రకటించారు.

అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను స్థాపించి

అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను స్థాపించి లగచర్ల పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నామని సీఎం చెప్పారు. ఇక్కడి పిల్లలకు విద్యతో పాటు పరిశ్రమలలోనూ ఉద్యోగాలు కల్పించే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇక్కడ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే రైల్వే లైన్ కావాలని, అందుకే వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్ (వికారాబాద్, పరిగి కొడంగల్ నారాయణపేట్, మక్తల్) నుంచి కర్నాకట రాష్ట్రానికి రైలు మార్గం కోసం కేంద్ర ప్రభుత్వ ఆమోదమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది అక్కా, చెల్లెళ్లకు కోటి నాణ్యత కలిగిన చీరలను సారెగా అందిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రతి ఆడబిడ్డకు చీర అందాలి. ప్రతి ఆడబిడ్డ ఇంటికెళ్లి చీర అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో బడి, గుడి, తాగడానికి మంచినీరు, ఇందిరమ్మ ఇండ్లు కావాలని, మరి, ఇలాంటి పనులు చేయాలంటే రాబోయే సర్పంచు ఎన్నికలలో మంచి వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అటు స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని 300 కోట్ల రూపాయల చెక్కును అందించారు. మద్దూరు మండల మహిళా సమాఖ్య సౌజన్యంతో నడపనున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మంత్రులు దామోదర రాజనర్సింహా , వాకిటి శ్రీహరి, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వేటాడడం ఆపండి

మొదటిపేజీ తరువాయి

సభ్యులు సతీశ్, చంద్రన్న కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించారని, ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం ఆయుధాలు వదిలేయాలని భావిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఈ నిర్ణయాన్ని సమష్టిగా అమలు చేయడానికి మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు 15 ఫిబ్రవరి 2026 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. పార్టీ సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం సందేశాలు తెలియజేయడానికి కొంత సమయం పడుతుందని వివరించారు. ఈ సమయాన్ని అడగడానికి ఇతర ఉద్దేశాలు లేవని, త్వరగా కమ్యూనికేట్ చేయడానికి వేరే సులభ మార్గాలు లేకపోవడమే కారణమని స్పష్టం చేశారు. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేస్తే, తమ అన్ని కార్యకలాపాలను పూర్తిగా నిలిపేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాలను నిర్వహించబోమని, ఆయుధాలు త్యజించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ హామీతో పాటు, మూడు రాష్ట్రాల్లోని భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు తాత్కాలికంగా ఆపేసి, మావోయిస్టులకు సమయం కల్పించాలని కోరారు.

ఇక డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్!

మొదటిపేజీ తరువాయి

'సర్వే నంబర్ బ్లాక్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మోసం చేసే విధానానికి కూడా అడ్డుకట్ట

రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో కొనుగోలుదారులను మోసం చేసే విధానానికి కూడా అడ్డుకట్ట పడుతుంది. వెంచర్లలో రోడ్లు, పార్కులు వంటి మౌలిక వసతుల కోసం స్థలాన్ని కేటాయించకుండా, ఆ స్థలాన్ని కూడా ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. లే ఔట్ రోడ్లు, పార్కులను ముందే డిక్లేర్ చేసి, మిగిలిన ప్లాట్ల విస్తీర్ణం వాస్తవ భూమికి సరిపోతేనే రిజిస్ట్రేషన్ జరిగేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయనున్నారు. ఆస్తి ఎవరి పేరు మీద, ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఉందనే పూర్తి వివరాలు ఒకే పత్రంలో ఉంటాయి. దీనివల్ల నకిలీ పత్రాలు సృష్టించి అమ్మే ముఠాల ఆటలు సాగవు. ఆస్తి తగాదాలు సగానికిపైగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తున్నది. ఆస్తి చరిత్రను పూర్తిగా పరిశీలించేందుకు 1983 నుంచి ఉన్న ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) వివరాలను కూడా అనుసంధానించనున్నారు. దీనితో ఆ ఆస్తి గత 40 యేండ్లుగా ఎవరెవరి చేతులు మారింది. లింక్ డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా! అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం కావడం వల్ల ఆస్తి చరిత్ర మొత్తం ఆన్‌లైన్‌లో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

మహిళల కబడ్డీ ప్రపంచ కప్ విజేత భారత్

మొదటిపేజీ తరువాయి

20-16 ఆధిక్యంలో నిలిచి, ప్రత్యర్థిపై ఒత్తిడిని కొనసాగించింది. చివరి ఐదు నిమిషాలలో భారత్ ఆధిపత్యం 29-24కు చేరింది. తైపీ ఆటగాళ్లు ఎంతగా పోరాడినా చివరికి భారత్ ను అధిగమించలేకపోయారు. ఏడు పాయింట్ల తేడాతో భారత్ విజయకేతనం ఎగురవేసింది. ఈ మెగా టోర్నమెంట్‌లో 11 దేశాలు పాల్గొన్నాయి. సెమీఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 తేడాతో భారత్ గెలుపొందగా చైనీస్ తైపీ బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఈ వరల్డ్ కప్‌తో కలిపి ఇప్పటి వరకు మహిళల కేటగిరీలో నిర్వహించిన రెండు వరల్డ్ కప్‌లను భారత్ గెలుచుకోవడం విశేషం.

'హీ మ్యాన్' నో మోర్

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేసింది. దాదాపు 300కు పైగా చిత్రాలలో నటించిన ఆయన యాక్షన్ కింగ్, బాలీవుడ్ 'హీ మ్యాన్'గా పేరొందారు. ధర్మేంద్ర పార్థీవ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్సులో స్థానిక విల్లే పార్లీ శ్మశాన వాటికకు తరలించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బాలీవుడ్ సినీ ప్రముఖులు, పొలిటికల్ లీడర్స్ కడసారి చూసేందుకు శ్మశానవాటికకు తరలివచ్చి నివాళులు అర్పించారు. ధర్మేంద్ర పూర్తి పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్. 1935, డిసెంబర్ 8న జన్మించారు. 1954లో ప్రకాష్ కౌర్‌ను వివాహం చేసుకున్నారు. 1980లో హీరోయిన్ హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్ర ప్రకాష్ కౌర్‌కు సన్నీ డియోల్, బాబీ డియోల్ సంతానం. ధర్మేంద్ర హేమమాలినిలకు ఇషా డియోల్, ఆహానా డియోల్ సంతానం. 1960లో 'దిల్ బీ తేహ హమ్ బీ తేరా'తో కెరీర్ ప్రారంభించిన ఆయన అన్‌పఢ్, బాందినీ, అనుపమ, ఆయా సావన్ జూమ్ కే, షోలే, ధర్మవీర్, చుప్కే చుప్కే, మేరా గావ్ మేరా దేశ్, డ్రీమ్ గర్ల్ వంటి చిత్రాలతో పాపులారిటీ సంపాదించుకున్నారు. ఆయన చివరి చిత్రం 'ఇక్కీస్'. తన నటనతో మెప్పించిన ధర్మేంద్ర బాలీవుడ్ ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2012లో పద్మభూషణ్‌తో గౌరవించింది. తన నటన, నిరాడంబరతతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ధర్మేంద్ర, భౌతికంగా దూరమైనా తన సినిమాల ద్వారా ఎప్పటికీ చిరంజీవిగా నిలిచిపోతారు.

రాష్ట్రపతి ముర్ము , ప్రధాని మోడీ సంతాపం

ప్రముఖ నటుడు ధర్మేంద్ర మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని రాష్ట్రపతి ముర్ము అన్నారు. ఆయన మరణంతో భారత చలనచిత్ర పరిశ్రమలో ఒక శకం ముగిసిందని ప్రధాని మోడీ అభివర్ణించారు. ధర్మేంద్ర కేవలం ఒక గొప్ప నటుడు మాత్రమే కాదని, ఆయన నిరాడంబరత, వినయానికి ప్రతీక అని కొనియాడారు. ఈ విచారకరమైన సమయంలో ఆయన కుటుంబసభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధర్మేంద్ర తన సుదీర్ఘమైన సినీ ప్రస్థానంలో ఎన్నో మరపురాని పాత్రలతో ప్రేక్షకులను అలరించారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

ముగిసిన అంత్యక్రియలు

ధర్మేంద్ర అంత్యక్రియలు ముంబైలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమ ప్రముఖుల అశ్రునయనాల మధ్య జరిగాయి. ధర్మేంద్రకు తుది వీడ్కోలు పలికేందుకు బాలీవుడ్ పరిశ్రమ కదిలివచ్చింది. అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, ఆమిర్ ఖాన్ సహా పలువురు సీనియర్, జూనియర్ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు శ్మశానవాటికకు చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆరు దశాబ్దాల పాటు వెండితెరపై తనదైన ముద్ర వేసిన సహచర నటుడిని కోల్పోవడంతో వారంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

తీర్పులు ఇచ్చారు. హర్యానాలోని హిస్సార్‌లో ఒక సాధారణ కుటుంబంలో 10 ఫిబ్రవరి 1962న జన్మించిన జస్టిస్ సూర్యకాంత్ దేశ అత్యున్నత న్యాయస్థానం అత్యున్నత పదవికి చేరుకున్నారు. ఆయన హిస్సార్‌లో లా ప్రాక్టీస్ ప్రారంభించారు. తరువాత పంజాబ్ హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ కొనసాగించారు. 2018లో ఆయన హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కాగా, న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్ లో భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి కి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి పదవీ కాలం విశిష్టంగా, ప్రభావవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

కార్మికుల సంక్షేమంపై అవగాహన

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 24 : భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై పది రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇందుకు సంబంధించిన కార్యక్రమాన్ని ప్రారంభించి, గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు పొందడానికి బీఓసీడబ్ల్యూ రిజిస్ట్రేషన్ , రెన్యువల్ తప్పనిసరి అని, కార్మికులందరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి 2 లక్షలు, అందుతుందన్నారు. అంగ వైకల్యం కలిగితే సహాయం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. కార్మికులకు పెళ్లి కానుక గా 30 వేలు, ప్రసూతి సహాయం రూ. 30 వేలు, ఆస్పత్రి రిలీఫ్ రోజుకు రూ.300 అందుతాయన్నారు. నమోదు చేసుకొని కార్మికులు ప్రమాద వశాత్తు మరణిస్తే రూ. 50 వేలు ఆయుష్మాన్ భారత్ -రూ. 5 లక్షలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినీలా, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు భారీగా డ్రగ్స్

- 8 మంది డ్రగ్స్ పెడ్లర్లు అరెస్టు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : డ్రగ్స్ విక్రయాలపై ఎస్‌ఓటీ మాదాపూర్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఒకేసారి మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేశారు. నార్సింగి, చందానగర్ , కొల్లూర్ ప్రాంతంలో డ్రగ్స్ అమ్ముతుండగా వీరిని అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి పరిధిలో 4.5 గ్రాముల హెరాయిన్, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధి గోపీనగర్ వద్ద బస్సులో డ్రగ్స్‌ను తీసుకు వస్తుండగా ముఠాలను పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా బెంగళూరు నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. న్యూ ఇయర్ ఈవెంట్‌ను టార్గెట్‌గా పెట్టుకొని డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తోంది ముఠా. మొత్తం ముగ్గురు సభ్యుల ముఠాను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చందాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 42 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

@prathipaksham
prathipakshamtvtelugu
హైదరాబాద్
మంగళవారం
25.11.2025
3
ప్రతిపక్షం
Prathipaksham.in

నేడు మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ

- రూ. 300.40 కోట్లు నేరుగా ఖాతాలలో జమ
- 3.50 లక్షల స్వయం సహాయక సంఘాలకు లబ్ధి
- కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి వీడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : రాష్ట్రంలోని మూడున్నర లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 300.40 కోట్ల వడ్డీలేని రుణాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ చీరెల పంపిణీ పురోగతి, వడ్డీ లేని రుణాల పంపిణీ అంశంపై ఆయన సోమవారం సీఎస్ రామకృష్ణారావు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రి సీతక్క ములుగు నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మూడవ విడత వడ్డీ లేని రుణాలను మంగళవారం ఉదయం 11 గంటలకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వడ్డీ లేని రుణాలతో మహిళలలో ఒక ధైర్యం, నమ్మకం, ఆత్మవిశ్వాసం ఏర్పడిందని అన్నారు. రుణాల మొత్తం నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలలో జమవుతున్నందున ఎవరెవరికి ఎంతెంత మొత్తం అందిందో సభ్యులకు స్పష్టంగా తెలియ చేయాలని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ అద్భుతంగా సాగుతోందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్ధా ప్రకాష్, హౌసింగ్ ఎండీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీరాజ్ కమిషనర్ సృజన పాల్గొన్నారు.

కోకాపేటలో ఎకరం ధర రూ.137.25 కోట్లు

- టీజీఐఐసీ నిర్వహించిన వేలం పాటకు భారీ స్పందన

ప్రతిపక్షంస్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23 : నగర శివారులోని ఫైనాన్షియల్‌డిస్ట్రిక్ట్ కోకాపేటలో భూములు రికార్డు ధర పలికాయి. ఎకరం ధర అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. కోకాపేటలోని నియోపోలిస్ ప్రాంతంలోని సర్వే నంబర్ 17, 18లోని భూములకు హెచ్ఎండీఏ అధికారులు సోమవారం వేలం నిర్వహించారు. సర్వే నంబర్ 17లోని భూమి ఎకరం 137.25 కోట్లు పలికింది. సర్వే నంబర్ 18లోని భూమి ఎకరం రూ. 136.50 కోట్లు పలికింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయం : ఇటీవల రాయదుర్గంలో 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలీస్‌లోని సర్వే నంబర్ 17, 18లోని భూములను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించగా అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించండి

- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 24 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ సి,నారాయణ రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలన్నారు. రెవెన్యూ శాఖకు 8, ఇతర శాఖలకు 32, మొత్తం 40 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు

నిరంజన్ రెడ్డీ పుచ్చె పగులుతుంది

- ఇష్టానుసారంగా మాట్లాడితే కుదరదు
- జాగృతి అధ్యక్షురాలు కవిత మాస్ వార్నింగ్

ప్రతిపక్షం, వనపర్తి, నవంబర్ 24: పిచ్చి పిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి జాగృతి అధ్యక్షురాలు కవిత వార్నింగ్ ఇచ్చారు. తండ్రి వయసువారని ఇప్పటికీ గౌరవిస్తున్నానన్నారు. నిరంజన్ రెడ్డి మూడు ఫామ్ హౌజ్ కృష్ణానదిని కబ్జా చేసి కట్టుకున్నారన్నారు. 'ఈ విషయం కేసీఆర్ కు తెలియదా? హరీశ్ రావు తన మనిషి అని కేసీఆర్ కు తెలియకుండా చేస్తున్నారా?' అని ప్రశ్నించారు. నిరంజన్ రెడ్డి అరాచకాలు ఘోరాతిఘోరంగా ఉన్నాయని చిన్నపిల్లాడు కూడా చెబుతాడని, అలాంటి వ్యక్తి తనపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. 'జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు. పాత వాటికే కనెక్ట్ చేసి నీళ్ల నిరంజన్ రెడ్డి అని పేరు పెట్టుకోవటం సరికాదు. పెబ్లేరు సంత చాలా ఫేమస్. అక్కడ 32 ఎకరాలను నిరంజన్ రెడ్డి మనుషులు కబ్జా పెట్టి అమ్ముకోవాలని చూస్తున్నారని' ఆరోపించారు. 'రావుల చంద్రశేఖర్ రావు మంచి మనిషి. అవినీతి మరక లేనివారు. ఆయన కేసీఆర్ కు ఈ విషయాన్ని చెప్పి ప్రజలకు న్యాయం చేయాల్సిందన్నారు. ఇప్పటికైనా ఈ అంశంలో ఇక్కడి ప్రజల తరఫున ముందుండి పోరాడాలని కోరారు.

ఓఆర్ఆర్ పై కారులో మంటలు

- డ్రైవర్ అందులోనే సజీవ దహనం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 24: శామీర్‌పేట్ పీఎస్ పరిధిలోని ఓఆర్ఆర్ పై ఒక కారులో మంటలు చెలరేగాయి. ఘటనలో కారు డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. కారును రింగ్ రోడ్డు పక్కన ఆపి ఏసీ వేసుకొని నిద్రిస్తున్న సమయంలో మంటలు చెలరేగినట్టు పోలీసులు గుర్తించారు. సజీవ దహనమైన వ్యక్తి హన్మకొండ ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ (34)గా గుర్తించారు. కారు ఓఆర్ఆర్ దుండిగల్ ఎగ్జిట్ పై ఎక్కి హన్మకొండకు వెళ్తుండగా శామీర్ పేట ఎగ్జిట్ దాటిన తర్వాత ఉదయం 5: 50 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కార్, మృతుడు కారులో హీటర్ వేసుకొని నిద్రిస్తున్నాడని వివరించారు.

ఊరంతా ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ

- సీఎం స్వగ్రామం కొండారెడ్డి పిల్లిలో రెడ్కో
- విద్యుత్ వినియోగంపై అవగాహన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లాలోని కొండారెడ్డిపల్లి ఓ వినూత్న ప్రయోగానికి వేదికైంది. అక్కడ ప్రతి ఇంటికి పూర్తి ఉచితంగా సౌర విద్యుత్ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. వంటకు ఉపయోగపడే ఇండక్షన్ స్టవ్, కుక్కర్లను పంపిణీ చేశారు. కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా 'ఈ కుకింగ్ లేదా క్లీన్ కుకింగ్' పేరుతో ప్రత్యేక పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. విద్యుత్‌తో పని చేసే ఇండక్షన్ స్టవ్ తో గ్యాస్ సిలిండర్ల వాడకం బాగా తగ్గించవచ్చనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇంటిపై సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే ఉచితంగా కరెంటు లభిస్తుందని, దాంతో ఇండక్షన్ స్టవ్‌ను వినియోగిస్తే కరెంటు బిల్లు పెరుగుతుందనే భయం ఉండదని ఈ పథకం అమలుకు రాష్ట్రంలో నోడల్ ఏజెన్సీగా పని చేస్తున్న రెడ్కో పేర్కొంది. రాష్ట్రంలో ఇంధన పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. ఆరు కోట్లతో రాష్ట్ర ఇంధన పరిరక్షణ నిధిని ఏర్పాటు చేశాయి. దీనిని ఖర్చు పెట్టకుండా అలాగే ఉంచడంతో కొంత వడ్డీ కూడా సమకూరింది. ఈ నిధిని వినియోగించకుంటే వెనక్కి తీసేసుకుంటామని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) హెచ్చరించింది. రాష్ట్ర విద్యుత్‌శాఖ దీనిపై చర్చించి ఈ నిధిపై వచ్చిన వడ్డీని మాత్రమే వినియోగించి స్టవ్‌లు, కుక్కర్లను కొని కొండారెడ్డిపల్లిలో మహిళలకు ఉచితంగా పంపిణీ చేసేయాలని నిర్ణయించింది. ఇండక్షన్ స్టవ్‌తో వంట చేసుకున్నా ఇంకా కరెంటు మిగులుతుందని ప్రజలకు అవగాహన కల్పించినట్లుగా రెడ్కో ఎండీ అనిల తెలిపారు.

హోమ్ మంత్రిగా రేవంత్ రెడ్డి విఫలం

- ఎస్సీ ఎస్టీల రక్షణకు ప్రత్యేక ఠాణాలు కావాలి
- రాజశేఖర్ కుటుంబానికి 'కోటి' ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24: ఎర్ర రాజశేఖర్ అనే దళిత యువకుని దారుణ హత్య పోలీసుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని, ఈ హత్యకు పోలీసులే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. హోమ్ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విఫలం చెందారని ఆరోపించారు. సోమవారం ఆయన రాజశేఖర్ కుటుంబాన్ని షాద్ నగర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో దళితుల మీద దాడులు పెరుగుతున్నాయన్నారు. చేవెళ్ల సాక్షిగా దళితులను మోసం చేసి అధికారంలోకి వచ్చాక, దళితులనే చంపుతున్నారన్నారు. ఎర్ర రాజశేఖర్ హత్య ప్రణాళికాబద్ధంగా, పోలీసుల సహకారంతో జరిగిందని ఆరోపించారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులు నిందితుల కుటుంబం నుండి ప్రమాదం ఉందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. రాజశేఖర్ ఇంటికి వచ్చి బలవంతంగా ఎత్తుకెళ్లారని, అడ్డుగా వచ్చిన భార్యను కూడా తీసుకెళ్లే ప్రయత్నం చేశారన్నారు. ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులను నిలుపుదల చేసేందుకు గ్రే హౌండ్స్ తరహాలో ప్రత్యేక ఫోర్స్ ఏర్పాటు చేయాలని, అన్ని జిల్లాల్లో ప్రత్యేక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేస్తున్నది

- దేశవ్యాప్తంగా ఆ పార్టీని ఎండగడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : బీసీ రిజర్వేషన్ అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపైన ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో సోమవారం జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామన్నారు. తెలంగాణలో రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్ తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరు అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీల పైన, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడారు.

మధ్యాహ్న భోజన బిల్లులు ఇవ్వండి

- అప్పులు తీసుకొచ్చి అన్నం పెడుతున్నాం
- డీఎస్ఈ ముందు కార్మికుల ఆందోళన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు రాక అవస్థలకు గురవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముందు సోమవారం ఆందోళనకు దిగారు. బియ్యం ప్లాస్టిక్ లెక్క ఉంటున్నాయని నిజామాబాద్ జిల్లా వేంపూర్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు తెలిపారు. పిల్లలకు ఏమన్న అయితే మమ్మల్నే అంటారు కదా అని ఆవేదన చెందారు. కేసీఆర్ ఉన్నప్పుడు తమకు జీతాలు పెంచి, సమయానికి జీతాలు, బిల్లులు ఇచ్చిండని తెలిపారు. రేవంత్ రెడ్డి గత సంవత్సరం నుంచి జీతాలు, బిల్లులు ఇవ్వకపోవడంతో రూ. రెండు లక్షల అప్పు చేసి, ఇల్లు తాకట్టు పెట్టి భోజనం పెడుతున్నానని పేర్కొన్నారు. 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా గోసపెడుతున్నారని అన్నారు.



దుబాయిలో కార్మికుడి హత్య

- భార్యకు ప్రీ ప్రైమరీ టీచర్ ఉద్యోగం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 24 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, దుబాయిలో హత్యకు గురైన ఒక తెలంగాణ కార్మికుడి భార్యకు ప్రభుత్వం నిర్మల్ జిల్లాలో ప్రీ ప్రైమరీ టీచర్ ఉద్యోగం ఇచ్చింది. ఇటీవల ఆమె హైదరాబాద్ లోని సీఎం ప్రవాసీ ప్రజావాణి లో, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ని కలిసి ఉద్యోగం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో సీఎం చొరవతో ఫైలు వేగంగా కదిలింది. దుబాయి లోని ఒక బేకరీలో సహోద్యోగి అయిన ఒక పాకిస్తాన్ ఉన్మాది చేతిలో ఏప్రిల్ 11న కత్తిపోట్లకు గురైన నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్ లు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు అష్టపు ప్రేమ్ సాగర్ భార్య ప్రమీల సోమవారం నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్ గా ఉద్యోగంలో చేరారు.

టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

- కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయాలి
- న్యూఢిల్లీ మహాధర్నాలో వక్తల డిమాండ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : టీచర్లకు టెట్ నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీద కేంద్రం తక్షణమే జోక్యం చేసుకుని విద్యా హక్కు చట్టానికి సవరణ చేయాలని ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు వైఎస్ శర్మ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సోమవారం జరిగిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. జాతీయ అధ్యక్షులు బసవరాజు గురికర్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయుల మహాధర్నాకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయులు సుమారు 50వేల వరకు హాజరయ్యారు. ఉపాధ్యాయుల ఉద్యోగాలను కాపాడాలని, లేదా ఫిబ్రవరిలో 'చలో పార్లమెంటు'కు పిలుపునిస్తామని ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షులు బసవరాజు గురికర్, సెక్రెటరీ జనరల్ కమల కాంత్ త్రిపాఠి, కోశాధికారి ఉమా శంకర్, జాతీయ కార్యదర్శి వైఎస్ శర్మ హెచ్చరించారు. టెట్ నుంచి తప్పనిసరిగా మినహాయింపునివ్వాలని, ఓల్డ్ పెన్షన్ పథకం అన్ని రాష్ట్రాల టీచర్లకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో జాతీయ నాయకులు, అన్ని రాష్ట్రాల ప్రాథమిక ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు వివిధ రాష్ట్రాల ఎమ్మెల్సీలు తెలంగాణ రాష్ట్రం నుంచి వైఎస్ శర్మ, పి విక్రంబాబు, మహిపాల్ రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు!

కేఎల్ఆర్ వెంచర్లో జీ+2 అనుమతులు పొంది పెంట్ హౌజ్ నిర్మిస్తున్న దృశ్యం

- ఈ అక్రమాలకు చెక్ పెట్టేది ఎవరు?!
- మున్సిపల్ కమిషనరా! కలెక్టరా?
- పట్టణ ప్రజలలో కొనసాగుతున్న చర్చ

ప్రతిపక్షం ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 25: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలకు పరిమితి లేకుండా పోతోంది. దీనికి చెక్ పెట్టేది మున్సిపల్ కమిషనరా లేదా స్వయంగా జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగాలా అనే ప్రశ్న తలెత్తుతోంది. మున్సిపాలిటీలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని నాయకులు, సామాన్య ప్రజలు కమిషనర్ చంద్ర ప్రకాష్ కు తెలియజేయగా ఆయన మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో ఎన్నో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. ఎవరిరైనా బిల్డింగ్ నిర్వాహకులు మున్సిపల్ నుండి జి+2 అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో మాత్రం నిర్వాహకులు ప్రభుత్వానికి గండి కొట్టి అక్రమ నిర్వాహకులు జి+3 లేదా జి+2 పెంట్ హౌజ్ నిర్మాణాలు జరుపుతున్నారు. కొన్ని ప్రదేశాలలో అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు జరుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కమిషనర్ చంద్రప్రకాష్‌కు ఫిర్యాదులు ఇచ్చిన ఆయన మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారిని సమర్థిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా కమిషనర్ చట్ట విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

"గువాహటి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమే. పరుగులు చేయకుండా ఎక్కువ సేపు నియంత్రించలేరు. ఇదేమీ బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్ కాదు. ట్రూ వికెట్. ఇలాంటివి ఇండియాలో అరుదుగా ఉంటాయి. క్రీజ్‌లో నిలబడితే రన్స్ వస్తాయిరు. 6 వికెట్లు తీసిన జాన్సెన్‌కు అసాధారణ బౌన్స్ రాలేదు. అతడు ఎత్తుగా ఉండటం వల్ల గుడ్ లెంత్‌లో బౌలింగ్ చేశారు.

- భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్

ఓపెన్ వాయిస్

మహానగరాభివృద్ధిని విస్మరిస్తే కష్టమే!

హైదరాబాద్ 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు రాజధానిగానే తెలుసు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధి మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసింది. రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తగ్గించింది. ఇక రక్షణ విషయంలో అనేక చర్యలు చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. ఈ రెండేండ్లలోనూ హైదరాబాద్‌కు ఆయన పెద్దగా చేసిందేమీ కనిపించడం లేదు. తెలంగాణకు విశ్వనగరం హోదా వచ్చినా, రాష్ట్రానికి సగం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తున్నా నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఐటీ రంగం, ఇతర పరిశ్రమలు, సేవలు నగరాభివద్ధిని ముందుకు నడిపిస్తున్నాయి. ఒక కోటి జనాభా దాటిన హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులే 10 లక్షల మంది ఉన్నారు. వీరిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 15 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. అయినా, నగరం గడిచిన రెండేండ్లలో పెద్దగా అభివృద్ధి చెందిన దాఖలాలు ఏవీ కనిపించడం లేదు. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ నగర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. నగర ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రతిపాదనలు ఉన్నా, కార్యాచరణలో అందుబాటులోకి రావడం లేదు. ముఖ్యంగా నానల్ నగర్ ట్రై జంక్షన్, బేగంపేట, రసూల్ పురా వంటి ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో కొత్త ఫ్లైఓవర్‌లు, రోడ్డు విస్తరణలకు ప్రతిపాదనలు చేసినా, నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. రూ. మూడు లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ రమదారులకు రూ.2,654 కోట్లు మాత్రమే కేటాయించారు. నీరు, డ్రెయినేజీ, మెట్రోతోసహా ఇతర పనులకు మరో రూ. ఆరు వేల కోట్లు కేటాయించారు. కానీ, ఉచిత పథకాలకు రూ. లక్ష కోట్లు కేటాయించారు. హైదరాబాద్ రోడ్లకన్నా 'కళ్యాణలక్ష్మి' 'షాదీముబారక్' వంటి పథకాలకు ఎక్కువగా రూ.3,683 కోట్లు కేటాయించారు. నగరంలో 24 గంటలు తాగునీరు, రెయిన్ వరదలు, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాధాన్య అంశాల ఆచరణలో పురోగతి లేదు, ప్రజలు ఇటు నరకయాతన అనుభవిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తర్వాత ప్రజలలో అభివృద్ధికి కొత్త ఆశలు వెలిగాయి. రాబోయే మూడేళ్లలో అయినా ప్రభుత్వం సమగ్ర దృష్టితో హైదరాబాద్‌ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉంది. ఆదాయ కేంద్రమైన హైదరాబాద్ మహా అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. నూతన మౌలిక సదుపాయాలు, మెట్రో రైలు విస్తరణ, రోడ్డు పనులు, కనీస సేవలు పై ప్రత్యేక దృష్టి పెడితే, నగరం బంగారు బాతుగుడ్డు నుంచి ప్రజల నిండైన అనుభవానికి మారుతుంది. కొత్తగా మరో 10 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పరోక్షంగా మరో పది లక్షల మంది ఉపాధి పొందుతారు. కంపెనీలు హైదరాబాద్‌కు తరలి వస్తాయి. లేదంటే బెంగళూరులా మారిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి విషయాల మీద ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వారు ఇంకా మూడేండ్లు అధికారంలో ఉంటారు. కావలసినంత సమయం ఉంది. నగర ప్రజలు ఈ ప్రభుత్వం మీద ఇప్పుడిప్పుడే నమ్మకం పెంచుకుంటున్నారు. దానిని నిలుపుకోవాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంది. కాంగ్రెస్ లో స్వాతంత్ర్యం ఎక్కువ అనే అభిప్రాయం ఉంది. అది నిజమే అయినప్పటికీ, మంత్రుల మధ్య, కీలక నేతల మధ్య వివాదాలు మంచివి కావు. మీడియా ముందు వెనుకా ముందూ ఆలోచించకుండా చేసే వ్యాఖ్యలు చేటు తెస్తాయని గ్రహించాలి. అప్పుడే సుదీర్ఘకాలం అధికారంలో ఉండే అవకాశం లభిస్తుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
25.11.2025

ఇంతకీ ఈ పది మంది ఏమయ్యారు!!

అప్పట్లో అంటే, 1985 తర్వాత పోలీసులు మిలిటెంట్లను చంపి మృతదేహాలను బయటకు ఇవ్వలేదు. నక్సల్స్ అణిచివేతలో పాల్గొన్న పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించారు. మరో వైపు పోలీసు ఏజెంట్ల టీమ్ నల్ల దండు ముఠా కూడా మిలిటెంట్ల చంపి వాళ్లే కాల్చి బూడిద చేశారు. యువకులను చంపి కనీసం ఫొటోలు కూడా రిపోర్టర్లకు ఇవ్వలేదు. పాపం వారు అలా ఆ జాబితాలో ఉన్నవారే కావచ్చు. వారి బంధువులు ఇంకా పార్టీలో ఉన్నారని ఎదురుచూస్తున్నారు. వందల మంది నేలకొరుగుతుండగా, శవాలు గుట్టలు గుట్టలుగా పడుతున్నాయి. లొంగిపోతున్నవారి లెక్కలలో కూడా లేరు. వారు ఏ విధంగా చూసినా ఏ లెక్కలలో లేరు ఇది నిజం నూరు శాతం నిజం!!

కట్టా నరేంద్రాచారి
6303073400

వీళ్లంతా మావోయిస్టు పార్టీలో ఉన్నారా? మావోయిస్ట్ పార్టీ లో చేరిన తమవాళ్లు ఇంకా బతికి ఉన్నారని భావిస్తున్న కుటుంబాల వారు గుండె ధైర్యం తెచ్చుకోవాలి. దశాబ్దాలుగా పార్టీలో ఎక్కడో ఉంటే చాలు అనుకున్నారు. తిరిగి రావొచ్చు లేదా అమరులుగా మారుతారు. కానీ అని నిట్టూర్పులో ఉన్న కుటుంబాలకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. లొంగిన మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్ రావు, తక్కళ్లపల్లి వాసుదేవరావును అడిగితే అలాంటి వారు బస్తర్, ఛత్తీస్ గఢ్ సహా ఇతర రాష్ట్రాలలో లేరని చాలా స్పష్టంగా చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1983 తర్వాత అప్పటి పోలీస్ నిర్బంధంలో అడవిబాట పట్టినట్టు లెక్కలలో ఉన్నట్టు అందరూ భావించారు. కానీ, ఇప్పుడు ఆ పది మంది అన్నల గూర్చి వింటే చాలు గుండె బరువెక్కుతుంది. పాపం ఈ పదిమంది ప్రాణాలతో ఉన్నారన్నది ముమ్మాటికి డౌటే! మావోయిస్ట్ పార్టీలో చేరిన వారిలో పలువురు నేతలు లొంగిపోతున్నారు. లేదా బీజేపీ సర్కార్ తలపెట్టిన ఆపరేషన్ లో చనిపోతున్నారు. ఆ పది మంది ఏ లెక్కలలో కూడా లేరు. ఇంత కాలం వరకు ప్రభుత్వం ఆ అన్నలపై రివార్డ్ కూడా ప్రకటించింది. వాళ్లు ఎవరు? వాళ్లు ఏమయ్యారు?

వీరి ఆచూకీ ఎక్కడా లేదు!

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి మాయమైన వారు. మంథని మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డికి స్వయానా బావమరిది అయిన గంకిడి సత్యనారాయణ రెడ్డి పెద్దపల్లిలో ఐటీఐ చదివిన తర్వాత వరంగల్ జిల్లాలో పై చదువుల కోసం వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆచూకీ లేదు. గంకిడి సత్యన్న పార్టీలో చేరారని, ఆయన రాష్ట్ర, లేదా కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ నుంచి వచ్చిన ఓ ముఖ్య నాయకుడు అసలు గంకిడి సత్యనారాయన రెడ్డి ఏ కమిటీలో లేరు. పార్టీలోకే రాలేదని అన్నారు. ఇంకా ఆలేటి రామ లచ్చులు, పాలితం 1983లో యూజీలో ఉన్నారు. ఇది పోలీస్ స్టేషన్ రికార్డ్. 65 యేండ్ల వయస్సున్న రామలచ్చులును కూడా చూడలేదని కీలక నేతలు అంటున్నారు. అంటే రామలచ్చులును ఎవరు చంపారు? ఎవరు మాయం చేసారు? మరో విద్యార్థి నాయకుడు ధాతు అశోక్ వరంగల్ జిల్లాలో స్టూడెంటుగా పార్టీలో చేరారు. గోపయ్యపల్లి. ఇప్పుడు అశోక్ వయస్సు 42. డిగ్రీ చదువుతున్న కొడుకు ఎక్కడ ఉన్నాడో చెప్పమంటూ పెద్దపల్లి పోలీసులు అనేక సార్లు అశోక్ తల్లి తండ్రులను చిత్రహింసలకు గురి చేసారు. పాపం ఎక్కడా బతికి లేడని తేలిపోయింది. హుజూరాబాద్ కు చెందిన మాజీ దళపతి పంజాల వెంకటనారాయణ అదృశ్యం వీడలేదు. ఎందరో నాయకులు లొంగిపోతే ఆయన మాత్రం జాడలేరు. 1983 నుంచి ఇప్పటివరకు జాడలేని కాసులపల్లికి చెందిన అలువాల ప్రభాకరరెడ్డి ఎల్లవరం దళంలో డిప్యూటీ కమాండర్ స్థాయిలో పని చేస్తూ మాయం అయ్యాడు. తెలంగాణ సర్కార్ కొంతకాలంగా సానుకూలంగా ఉండడంతో ఇప్పటికీ జాడలేదు.

1985 లో అడవి బాట పట్టారు

జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన సంబంధాలు కలిగి ఉన్నాడు. దీంతో పార్టీలోకి వెళ్లారని ప్రచారం కావడంతో భార్య పిల్లలు కిషన్ రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో అనేక సార్లు పత్రిక ద్వారా లొంగిపొమ్మంటూ భార్య విన్నమించారు. కానీ, కిషన్ మాత్రం పార్టీలో లేరని ముఖ్యులు చెబుతున్నారు. వీళ్లందరూ ఏమయ్యారో తెలియని విషయంకాదు.

మృతదేహాలను బయటకు ఇవ్వలేదు.

అప్పట్లో అంటే, 1985 తర్వాత పోలీసులు మిలిటెంట్లను చంపి మృతదేహాలను బయటకు ఇవ్వలేదు. నక్సల్స్ అణిచివేతలో పాల్గొన్న పోలీస్ అధికారులు కఠినంగా

దికొండ శంకరయ్య రాడికల్ యువ సంఘంలో చేరారు. తీవ్ర నిర్బంధ పరిస్థితుల నేపథ్యంలో శంకరయ్య మాయం కావడంతో ఆయన 1984 లో యుజీ అయినట్టు కనిపించారు. తీరా చూస్తే శంకరయ్య పార్టీలో లేనే లేరని అంటున్నారు. అలాగే, గోదావరిఖని నుంచి మాయమైన తాళ్లపల్లి తిరుపతి 1990 లో సికాస లో పనిచేస్తూ కనపడకుండా పోయారు. కోరుట్లకు చెందిన బెజ్జారపు కిషన్, మెకానిక్ 1985లో అడవి బాట పట్టారు అంటూ, ఈపాటికి ఆయన మావోయిస్టు టాప్ లిస్టు లో సీసీ స్థాయి లో ఉంటారని అందరూ ఊహించారు. అప్పట్లో కిషన్ ఆర్ఎస్యూతో వ్యవహరించారు. మరో వైపు పోలీసు ఏజెంట్ల టీమ్ నల్ల దండు ముఠా కూడా మిలిటెంట్ల చంపి వాళ్లే కాల్చి బూడిద చేశారు. యువకులను చంపి కనీసం ఫొటోలు కూడా రిపోర్టర్లకు ఇవ్వలేదు. పాపం వారు అలా ఆ జాబితాలో ఉన్న వారే కావచ్చు. వారి బంధువులు ఇంకా పార్టీలో ఉన్నారని ఎదురుచూస్తున్నారు. వందల మంది నేలకొరుగుతుండగా, శవాలు గుట్టలు గుట్టలుగా పడుతున్నాయి. లొంగిపోతున్న వారి లెక్కలలో కూడా లేరు. వారు ఏ విధంగా చూసినా ఏ లెక్కలలో లేరు ఇది నిజం నూరు శాతం నిజం!!

(వ్యాస రచయిత ఇండిపెండెంట్ సీనియర్ జర్నలిస్ట్)

రాష్ట్రం అప్పుల ఊబిలో ఎందుకు?!

కాగ్ నివేదికలు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయకుండా, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ తిరిగి బలంగా నిలబడాలంటే, రాజకీయాలకు అతీతంగా, ఆర్థిక క్రమశిక్షణే ఏకైక మార్గం. అందుకోసం, ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర 'ఆర్థిక పునరుద్ధరణ ప్రణాళిక'ను ప్రకటించాలి. అనవసరమైన రెవెన్యూ వ్యయాలను తగ్గించి, మూలధన వ్యయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారదర్శకత మరియు దృఢ సంకల్పం ఉంటేనే రాష్ట్రం తన ఆర్థిక సుస్థిరతను తిరిగి సాధించగలుగుతుంది. లేదంటే, ఆర్థిక వైఫల్యం మాత్రమే కాదు, రాబోయే తరాలకు తీవ్ర శిక్ష అవుతుంది.

ఫిరోజ్‌ఖాన్
9640466464

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2025లో విడుదల చేసిన తాజా నివేదికలు, ప్రత్యేకించి 2023-24 ఆర్థిక సంవత్సరంపై సమర్పించిన లెక్కలు, 2025-26 తొలి నెలల సూచికలు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక నిర్వహణపై తీవ్రమైన ప్రశ్నలు సంధిస్తున్నాయి. నివేదిక కేవలం గణాంకాల సారాంశం కాదు. రాష్ట్రం అనుసరించిన అతి ఖర్చు, క్రమశిక్షణారాహిత్యం కారణంగా రాష్ట్రానికి అవమానం తెచ్చిన వైనాన్ని బయటపెడుతోంది. పాలకులు ఆకర్షణీయమైన నినాదాలు ఇస్తున్నప్పటికీ, వాస్తవ ఖజానా పరిస్థితి తీవ్రంగా దెబ్బతింది. దీర్ఘకాలిక ప్రగతిని పక్కన పెట్టి, కేవలం తాత్కాలిక రాజకీయ అవసరాల కోసం అప్పులపై ఆధారపడటం రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది.

అప్పుల చిట్టా ఇలా

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకర అంశం అదుపు తప్పిన రుణభారం. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రాష్ట్రం మొత్తం బడ్జెటరీ అప్పు రూ. 4,03,664 కోట్లకు చేరింది. దీనికి అదనంగా, వివిధ కార్పొరేషన్లు, ఎస్పీవీల ద్వారా ప్రభుత్వం హామీ ఇచ్చిన బడ్జెటేతర అప్పులు అక్షరాలా రూ.2,20,607 కోట్లు ఉన్నాయి. రుణాల మొత్తం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తికి (జీఎస్డీపీ) తీవ్ర ముప్పు అని కాగ్ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా, అప్పులను ఉత్పాదక ఆస్తుల సృష్టికి కాకుండా రెవెన్యూ వ్యయాలకు వినియోగించడంపై నివేదిక తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పారదర్శకత లేని ఆర్థిక విధానం రాష్ట్ర ఖజానాను దివాలా తీసేలా చేసింది. కాగ్ నెలవారీ నివేదికలలో ప్రభుత్వ ప్రకటనలు, వాస్తవాలు ఎంత దూరంగా ఉన్నాయో స్పష్టమైంది. నెలకు రూ.6,000 కోట్ల దాకా వడ్డీ చెల్లిస్తున్నామని ప్రకటించినా, ఏప్రిల్ 2025 నుండి అక్టోబర్ 2025 వరకు ఏడు నెలలలో చెల్లించింది రూ.16,529.88 కోట్లు



మాత్రమే. గణాంకాల వైరుధ్యం అప్పుల వాస్తవ చిత్రాన్ని దాచిపెట్టే ప్రయత్రాలను ఎత్తి చూపుతోంది. 2023-24 రెవెన్యూ రాబడిలో దాదాపు 45 శాతం జీతాలు, పించన్లు, వడ్డీలకే ఖర్చు కావడం, అభివృద్ధి పనుల కోసం నిధులు లేవనే చేదు నిజాన్ని నిరూపిస్తోంది. అధిక వడ్డీలు కదుతున్నందున ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

మౌలిక వసతులు, సంక్షేమంపై దెబ్బ

అధిక రుణాల ప్రభావంతో రాష్ట్ర మౌలిక వసతుల కల్పన ఆగిపోయింది. కొత్త ఉత్పాదక ఆస్తుల సృష్టికి సంబంధించిన పెట్టుబడి ఖర్చు తగ్గింది. ముఖ్యమంత్రులు, మంత్రులు వ్యక్తిగత ప్రయాణాలు, అనవసర ఖర్చులకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం నివేదికల సారాంశం. కేసీఆర్ కిట్ వంటి పథకాలకు కనీసం రూ.300 కోట్లు కూడా కేటాయించలేకపోవడం, రోడ్ల నిర్వహణ బిల్లులు చెల్లించలేని పరిస్థితి పాలనా వైఫల్యాన్ని తెలియజేస్తోంది. ఆసరా పింఛన్లు, రైతు భరోసా వంటి ప్రజలకు అత్యవసరమైన పథకాల అమలులో జాప్యం, నిధుల కొరత ప్రభుత్వ సమర్థతపై అనుమానాలను పెంచుతున్నాయి. కాగ్ నివేదికలు కేవలం ఖర్చులనే కాదు, రాష్ట్ర ఆదాయ వనరుల నిర్వహణ లోపాలను కూడా ఎత్తి చూపాయి. రాష్ట్రంలో పన్ను వసూళ్ల లక్ష్యం 2025-26 తొలి అర్ధభాగంలో 40.97 శాతానికి మాత్రమే చేరుకోవడం నిర్వహణా నిర్లక్ష్యానికి నిదర్శనం. ఉన్నతాధికారుల తరచూ బదిలీలు, కీలక నిర్ణయాలలో ఆలస్యం వంటి అస్థిర పాలన పన్నుల రాబడిపై ప్రభావం చూపింది. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా, ఆర్థిక విధాన రాహిత్యం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పన్నుల వసూళ్లలో ఉన్న లీకేజీలను అరికట్టి, ఆదాయాన్ని పెంచడానికి కఠిన చర్యలు తీసుకోవాలి.

ఖుదా హాఫీజ్ చెప్పకముందే చర్యలు అవసరం

కాగ్ నివేదికలు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయకుండా, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ తిరిగి బలంగా నిలబడాలంటే, రాజకీయాలకు అతీతంగా, ఆర్థిక క్రమశిక్షణే ఏకైక మార్గం. అందుకోసం, ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర 'ఆర్థిక పునరుద్ధరణ ప్రణాళిక'ను ప్రకటించాలి. అనవసరమైన రెవెన్యూ వ్యయాలను తగ్గించి, మూలధన వ్యయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారదర్శకత మరియు దృఢ సంకల్పం ఉంటేనే రాష్ట్రం తన ఆర్థిక సుస్థిరతను తిరిగి సాధించగలుగుతుంది. లేదంటే, ఆర్థిక వైఫల్యం మాత్రమే కాదు, రాబోయే తరాలకు తీవ్ర శిక్ష అవుతుంది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

ముగిసిన హీ మ్యాన్ ధర్మేంద్ర యుగం

రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

భారతీయ హిందీ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహానటులలో ధర్మేంద్ర కూడా ఒకరు. సగం శతాబ్దానికి పైగా తన నటనా ప్రస్థానంతో కోట్లాది ప్రేక్షకుల గుండెలలో చిరస్మరణీయ స్థానం సంపాదించిన ఈ మహానటుడు 24 నవంబర్ 2025న తన 90వ యేట తుది శ్వాస విడిచారు. ఆయన మృతి భారత సినీ ప్రపంచానికి ఓ యుగాంతం. సాహసోపేత యాక్షన్, సహజ ప్రేమాభినయం, హాస్యంలో మృదుత్వం, గంభీరతలో సౌమ్యత ధర్మేంద్ర సొంతం. 1935 డిసెంబర్ 8న పంజాబ్ రాష్ట్రంలోని లూథియానా జిల్లా సహ్నేవాల ప్రావిన్స్ బ్రిటిష్ ఇండియా (ప్రస్తుత పంజాబ్), గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన ధర్మసింగ్ దేవ్ చిన్నప్పటి నుంచే సినిమాల పట్ల అపారమైన ఆకర్షణ కలిగి ఉన్నాడు. పంజాబ్‌లో విద్యను పూర్తి చేసిన అనంతరం ఫిల్మ్‌ఫేర్ పత్రిక నిర్వహించిన 'న్యూ టాలెంట్ హంట్' పోటీలో విజేతగా నిలవడం ఆయన సినిమా జీవిత ప్రారంభానికి మార్గం సుగమం చేసింది. ఆ పోటీ ఫలితంగా 1958లో ముంబై చేరుకున్న ఆయన 1960లో విడుదలైన 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' చిత్రంతో తెరంగేట్రం చేవారు. మొదటలో సున్నిత ప్రేమికుడిగా, భావోద్వేగ నటుడిగా చిన్నచిన్న పాత్రలు చేసినా, అతని కండ్లలోని నిజమైన భావం, సహజ హావభావాలు ప్రేక్షకుల మనసును గెలుచుకున్నాయి.

అనేక చిత్రాలతో ఆదరణ

బందిని, అనుపమ, సత్యకామ్, చుప్కే చుప్కే, ఆకాశ్ దీప్, హక్‌ఖీ వంటి చిత్రాలు ఆయనలోని లోతైన భావ వ్యక్తీకరణకు సాక్ష్యాలుగా నిలిచాయి. బిమల్ రాయ్, హృషికేశ్ ముఖర్జీ వంటి దర్శకులు ఆయన నటనలోని సహజత్వాన్ని గుర్తించి, క్లాసిక్ సినిమాలలో ప్రధాన పాత్రలు ఇచ్చారు. 1966లో వచ్చిన 'ఫూల్ ఔర్ పత్థర్' ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. ఇందులో ఆయన యాక్షన్ హీరోగా నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాడు. అదే సంవత్సరం ఆయనకు 'ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ యాక్టర్ అవార్డు' కోసం నామినేషన్ కూడా దక్కింది. ఆ తర్వాత వచ్చిన రాజా జానీ, షరాఫత్, నయా జమానా, ఫత్తర్ ఔర్ పాయల్, తుమ్ హసీన్ మై జవాన్, మా, చాచా భతీజా, షోలా ఔర్ షబ్నమ్, మజ్బూర్, పాయల్ కీ ఝుంకార్, షికార్, యాదోం కీ బారాత్, ధర్మ్ వీర్, చరసీ, జుగనూ, దోస్త్, రామ్ బలరామ్, ఖాతిలో కా ఖాతిల్, దిల్ లాగీ, అజాద్, హఖీఖత్, చుప్కేచుప్కే, సీతా ఔర్ గీతా, షోలే

వంటి చిత్రాలు ఆయన బహుముఖ ప్రతిభకు సాక్ష్యం. హృషికేశ్ ముఖర్జీ దర్శకత్వంలో ధర్మేంద్ర నటించిన సత్యకామ్ చిత్రానికి కూడా ఆయన ప్రశంసలు అందుకున్నారు.

'షోలే' చిత్రంలోని 'వీరు' పాత్ర

1975లో విడుదలైన 'షోలే' చిత్రంలోని 'వీరు' పాత్ర ఆయనకు శాశ్వత గౌరవం తెచ్చింది. 2004లో రాజస్థాన్ బికనీర్ నుండి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై రాజకీయ రంగంలో అడుగు పెట్టినా, ప్రజల మనసుల్లో ఆయనను నిలబెట్టింది ఆయన నటన. 2012లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారం ప్రదానం చేసింది. అంతకుముందు ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, నేషనల్ ఫిల్మ్ గౌరవాలు కూడా ఆయనకు లభించాయి. 'యమ్లా పగ్లా దివానా' సిరీస్‌లో తన కుమారులతో కలిసి నటించి కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ధర్మేంద్ర జీవితం ఒక సాధారణ రైతు కుమారుడు కృషి, నిబద్ధతతో, పట్టుదలతో ప్రపంచ ఖ్యాతిని పొందగలడని నిరూపించింది. ఆయన నవ్వు వెనుక ఉన్న స్నేహం, ఆయన కన్నీటి వెనుక ఉన్న మానవత్వం ప్రజలకు స్ఫూర్తి. ధర్మేంద్ర మరణంతో భారతీయ సినిమా ఒక యుగాన్ని కోల్పోయినట్లే. ఆయన మనిషితనం, నటనలోని సహజత్వం, తెరపై సృష్టించిన ఆ మమతా కాంతి ఎప్పటికీ చెరగదు. ఆయన పేరు భారతీయ సినీ చరిత్రలో బంగారు అక్షరాలతో చెక్కబడి నిలిచిపోతుంది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 24: అర్హులైన పేద మహిళలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం అని పేర్కొనారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలులో భాగంగా మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతోపాటు అర్హులైన పేద వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ రెడ్డి , చేవెళ్ళ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి , మాజీ ఎంపీటీసీ లు కేబుల్ రాజు , గణేష్ గౌడ్ , విఠల్ యాదవ్ , చిలుకూరు రాజు , మాజీ ఆర్మీ కుమార్ , ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిటి మహేందర్ , గూటికే రమేష్ రెడ్డి, యాదయ్య, రాములు,అనిమోని కృష్ణ, నడిమింటి బుచ్చిరెడ్డి, అంకారమోని భాను, కమ్మరి వెంకటయ్య, అనేమోని, మల్లేష్,దారెడ్డి నర్సింహారెడ్డి, అంతమొల్ల సుధాకర్,ఎండి సయీద్, ఎండీ మజీద్, షబ్బీర్, అజస్,పల్లె రవి అంతమొల్ల సందీప్,జంగిటి వంశీ,కుమ్మరికుంట్ల భిక్షపతి, కుమ్మరికుంట్ల సత్తయ్య , ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగిటి మహేందర్ , దారెడ్డి నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు , గ్రామ ప్రజలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బడాబాబుల ఆక్రమణలపై సామాన్యుల పోరాటం

- సమస్యల పరిష్కారానికి హైడ్రా ప్రజావాణిలో 64 ఫిర్యాదులు

ప్రతిపక్షం, సిటి బ్యూరో ,నవంబర్ 24: బడాబాబుల ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసుకుంటూ పోతుంటే గతంలో మాదిరి గమ్మున ఉండట్లేదు. దశాబ్దాల సమస్యలకు వెనువెంటనే హైడ్రా పరిష్కారం చూపడంతో.. ధైర్యాన్ని కూడగట్టుకొని వచ్చి ప్రజావానిలో ఫిర్యాదు చేస్తున్నారు. లే ఔట్లను చూపించి ఆక్రమణలు జరుగుతున్న తీరును వివరిస్తున్నారు. కాలనీలోంచి సాఫీగా సాగిపోయే వరద కాలువను.. బడా బిల్డర్స్ అడ్డుకుంటున్న వైనాన్ని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదే పరిస్థితి రహదారుల విషయంలోనూ జరుగుతోంది. లే ఔట్‌లోకి జరిగి మరీ రహదారులను కాజేసేస్తున్నారు. మూసాపేట ఆంజనేయనగర్‌లో కబ్జాలకు గురైన 2 వేల గజాల పార్కును హైడ్రా కాపాడిందని.. దీనిని పార్కుగా అభివృద్ధి చేసే బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలని అక్కడి నివాసితులు కోరారు. ఈ మేరకు హైడ్రా ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులందాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 వరకూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి సమస్య పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. ఫిర్యాదు దారుల ముందే గూగుల్ మ్యాప్స్, రెవెన్యూ, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ ఆధారంగా అక్కడ పరిస్థితులు గతంలో ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా మారాయి వివరించి పరిష్కార మార్గాలు సూచించడంతో ఫిర్యాదుదారులు ఊరట చెందారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 24: మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో ఇంట్లోకి చొరబడ్డారు

ప్రతిపక్షం, రామంతాపూర్, నవంబర్ 24: గంజాయి మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మైనర్ బాలికను, తల్లిదండ్రులను బంధించిన ఘటన రామంతాపూర్ లోని గాంధీనగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే గాంధీనగర్‌లో షేక్ బాబు, సూరియా బేగం నివాసముంటున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంట్లోకి చొరబడ్డారు. షేక్ బాబు, సూరియా బేగంను బంధించి వారి కూతురు (14) పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికుల సహాయంతో బాధితులు పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోస్కో మరియు ఇతర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం , సిటిబ్యూరో, నవంబర్ 24 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ సోమవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని నూతన శాసనసభ్యులుగా ఎన్నికైన నవీన్ యాదవ్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు. ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా వల్లాల నవీన్ యాదవ్ కి పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో మహిళ ఆత్మహత్య

మొయినాబాద్ ప్రతిపక్షం నవంబర్ 24: మండల కేంద్రంలో ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలిపేట నిర్మల వయస్సు (28) వృత్తి గృహిణి భర్త సాయికుమార్ మొయినాబాద్ కేంద్రంలోని గుల్షన్ కాలనీలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. సోలిపేట నిర్మల వ్యక్తిగత కారణాలతో ఇబ్బందులు పడుతూ.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కటిక పోగు యాదమ్మ ఫిర్యాదురాలు మొయినాబాద్ లో నివాసం ఉంటున్న కూతురును చూడటానికి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తన కూతురు ఇంటికి వచ్చి చూడగా తన కూతురు ఇంటి పైకప్పుకు ఉరివేసుకొని కనిపించింది. దీంతో తన తల్లి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి చూసేసరికి నిర్మల మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దేవాలయ భూములకు హద్దురాళ్ల ఏర్పాటు

- పలుమార్లు గ్రామస్తుల ఫిర్యాదు
- ఎట్టకేలకు హద్దురాళ్ల ఏర్పాటు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 24: చిట్యాల మండలం పెద్దకాపర్తి శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానం కు సంబంధించి సర్వే నెంబర్ 201 లోని 102 ఎకరాల భూమికి సర్వే నిర్వహించి రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సోమవారం నలువైపులా హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు చేకూరి గణేష్, పొట్లపల్లి చిన్నస్వామి తదితరులు జిల్లా అధికారులకు పలుమార్లు భూమి అన్యాక్రాంతమవుతుందని ఫిర్యాదు చేశారు. సుమారు 15 ఎకరాల పైగా అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకొని ఎట్టకేలకు సోమవారం నలువైపులా హద్దురాళ్ళను ఏర్పాటు చేశారు. త్వరలోనే పూర్తి కంచెను ఏర్పాటు చేస్తామని, ఇకపై దేవస్థాన భూమిలో రోడ్డు పనులు గాని మట్టి తవ్వకంగాని చేపట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వేయర్ పవన్ కుమార్, మండల సర్వేయర్ రజినీకాంత్, దేవాదాయ శాఖ అధికారులు సుమతి, అంబాటి నాగిరెడ్డి, జీపీవో రాణి, డిప్యూటీ తహసిల్దార్ సురేష్ పాల్గొన్నారు. అధికారులతో గ్రామస్తులు పొట్లపల్లి నరసింహ, నీలకంఠం లింగస్వామి, ఏర్పుల దామోదర్, ఏర్పుల రాకేష్, పున్న విష్ణు, మాచర్ల యాదగిరి, ఏర్పుల సత్తయ్య, పొట్లపల్లి వేణు, మోర రాములు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- గ్రామ పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం)

మొయినాబాద్, ప్రతిపక్షం, నవంబర్ 24: మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి గ్రామంలోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మొయినాబాద్ మండల పరిధి లోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన బొర్రా బుచ్చయ్య సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తన భార్యకు ఆర్థిక సహాయముగా పదివేల రూపాయలను అందజేసిన గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద్బాంధవుడిగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాను దేవుడు వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని భాగోద్వేగంతో పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ ఇచ్చిన చేయూతపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాములు, పెంటయ్య, యాదయ్య, ప్రహ్లాద్, కార్తీక్, ప్రశాంత్, రాజేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'దీక్షా దివస్' ను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే "చిరుమర్తి" పిలుపు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 24: నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఈనెల 29న "దీక్షా దివస్" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. కట్టంగూరులో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయా కేంద్రాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి శ్రేణులకు వివరించారు. తెలంగాణ వచ్చుడో సచ్చుడో అన్న తెగువతో కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారన్నారు. నకిరేకల్ లోని వంద పడకల ఆసుపత్రి వద్ద, కట్టంగూరు మండలం ఐటిపాముల లిఫ్టు వద్ద, నార్కట్‌పల్లి, రామన్నపేట మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ డివైడర్ వద్ద, చిట్యాల, కేతపల్లి కూడళ్లలో కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలని తెలిపారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్ని మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే శ్రేణులకు సూచించారు.

వృత్తి విలువల పరిరక్షణకై నిరంతర కృషి అవసరం

- టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, హైదరాబాద్ (మేడ్చల్) నవంబర్ 24: పవిత్రమైన జర్నలిజం వృత్తి విలువలను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. సోమవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, షాపూర్ లోని శుభం హోటల్ బాంక్వెట్ హాలులో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ బాధ్యతల స్వీకరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ హితం కోసం పురుడుపోసుకున్న మీడియాను, జర్నలిజం పట్ల అవగాహన లేని కొందరు అప్రతిష్టపాలు చేసే చర్యలకు పాల్పడడం సహించరానిదన్నారు. స్వాతంత్ర పోరాటం నుండి మొదలుకొని, మరెన్నో చారిత్రాత్మక ఉద్యమాల్లో మీడియా గొప్ప పాత్రను పోషించిందని, ఎందరో పాత్రికేయులు నీతి, నిజాయితీ, నిర్భీతితో వారి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని ఆయన కొనియాడారు. అసలు సమాజంలో జర్నలిస్టులు ఎవరనే? చర్చ ప్రస్తుతం ప్రజల్లో విస్తృతంగా జరుగుతుందని, దీనికి కారణం నకిలీల బెడదా పెరిగిపోవడమేనని ఆయన తెలిపారు. సమాజం మేలును కాంక్షిస్తూ, విలువలతో కూడిన వృత్తి బాధ్యతలను నిర్వర్తించే వారే నిజమైన జర్నలిస్టులనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని విరాహత్ అలీ సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం డెబ్బై ఏళ్లుగా మడమతిప్పని పోరాటం చేస్తున్న తమ సంఘం, నాటి నుండి నేటివరకు అదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేస్తుందని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని విరాహత్ అలీ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాల్ రాజ్ , వెంకట్రాంరెడ్డితో పాటు కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో ప్రధాన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో పనిచేస్తున్న వంద మంది జర్నలిస్టులు హాజరయ్యారు. కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే యూనియన్ గుర్తింపు కార్డులను రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ చేతుల మీదుగా పంపిణీ చేసారు. అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బాధ్యులను ఆయన సత్కరించారు.

ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల ప్రభుత్వం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 24: ఆలస్యమైన ఇచ్చిన మాట ప్రకారం మహిళలందరికీ నాణ్యమైన చీరలను ప్రభుత్వం అందిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్గొండ జిల్లా కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద, నకిరేకల్ లోని సాయిబాబా మందిరం, నోముల గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అలాగే కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల ప్రభుత్వమని అన్నారు. నియోజకవర్గానికి మొదటి విడత 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని, మరో విడత వచ్చే మార్చిలో కేటాయిస్తామని తెలిపారు.



అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను డిస్పోజ్ చేసేందుకు ఓ విధాన నిర్ణయం తీసుకోవాలి. కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలి. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి. బయో వేస్ట్ డిస్పోజల్స్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించొద్దు. 15,526 హెల్త్ కేర్ ఫెసిలిటీస్ ద్వారా వచ్చే బయో వ్యర్థాలను 48 గంటల్లోగా డిస్పోజ్ చేయాల్సిందే.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రతి మహిళకు ఆంక్షలు లేకుండా చీరలు ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రతిపక్షం నర్సంపేట, నవంబర్ 24: 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆంక్షలు లేకుండా చీరలు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా ఎలాంటి అర్హతా ప్రమాణాలు లేకుండా అన్ని మహిళలకు చీరలు పంపిణీ చేసిందని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ చేస్తూ వాటిని స్వయం సహాయక సంఘాల మహిళలకు మాత్రమే పరిమితం చేసిందని విమర్శించారు. రెండు సంవత్సరాలుగా మహిళలకు ఇవ్వాల్సిన బతుకమ్మ చీరలను కూడా ప్రభుత్వం అందించలేదని ఆయన అన్నారు.అదే విధంగా, ఎన్నికల ముందు మహాలక్ష్మి పేరుతో మహిళలకు నెలకు ₹2,500, విద్యార్థినులకు స్కూటీలు, వృద్ధ మహిళలకు ₹4,000 పెన్షన్, అలాగే కళ్యాణలక్ష్మిలో ₹1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు సంవత్సరాలు పూర్తయినా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని దుయ్యబట్టారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెబుతారని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. పాటించమని చెబుదాం

- హెల్మెట్ ధరించని 10-మంది పోలీసులకు ఫైన్
- హెల్మెట్, సెట్ బెల్ట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయండి
- అతివేగం ఆనందాన్నివ్వొచ్చు కానీ, అదే వేగంతో ప్రమాదం కూడా రావొచ్చు..
- ట్రాఫిక్ నిబంధనలు మన కుటుంబానికి రక్షా.. :జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 24: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశానుసారం సోమవారం ఉదయం సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, సిబ్బందితో కలిసి హెల్మెట్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా విధులకు హాజరవుతున్న పోలీసు సిబ్బందికి, ఫైన్ విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పోలీసులుగా మనం పాటించి, ఇతరులకు చెప్పాలని అన్నారు. ఇటీవలి కాలంలో అనేక మంది పోలీసులు హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఒక చిన్న తప్పిదం కుటుంబాన్ని రోడ్డున పడేసే పరిస్థితి తెస్తుంది... హెల్మెట్ తలకు మాత్రమే కాదు, మొత్తం కుటుంబానికే రక్షణ ఇస్తుందని అన్నారు. కావున విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వాహనాదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్, సీట్ బ్లెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు. అతివేగం ఆనందాన్నివ్వొచ్చు కానీ, అదే వేగంతో ప్రమాదానికి దారి తీయవచ్చు అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టునడితే సంబంధిత వాహన యజమానులు/ తల్లిదండ్రులపై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 24: నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి డివిజన్ లలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని,రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి 62 డివిజన్ సోమిడిలో సుమారు 1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ వాతారణంలో ఉన్న కాజీపేట ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ప్రధాన సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు తమ సహకారాన్ని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్,సయ్యద్ విజయశ్రీ రాజాలి మరియు ఇతర ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 76 దరఖాస్తులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 24 : జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 76 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు .అలాగే ప్రజల ప్రాధాన్య సమస్యలపై పూర్తి దృష్టి పెట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , మాధురి డి.ఆర్.ఓ పద్మజ రాణి సంబంధిత శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ధర్నా చేస్తే ప్రతిపక్ష నేతలపై కేసులు

- కక్షపూరిత రాజకీయ చర్యలకు నిదర్శనం
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 24: రైతుల నుండి పత్తి కొనుగోలు చేసే జిన్నింగ్ అండ్ సిసిఐ వారు అక్రమ లావాదేవీల వల్ల పత్తి కొనుగోలు బంద్ చేశారని, ఉమ్మడి జిల్లాలోని జిన్నింగ్ మిల్లులో పత్తి ఖరీదు చేస్తుంటే ఇక్కడ పత్తి కొనుగోలు చేయకపోవడం పై రైతులు నిరసన తెలుపుతుంటే మద్దతుగా వెళ్ళామని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ధర్నా చేస్తున్నప్పుడు పక్క నియోజక వర్గం సీఐ రైతులని వ్యంగ్యంగా మాట్లాడినందుకు ఆగ్రహం చెందిన రైతులు ధర్నాను ఉధృతం చేశారని, పోలీసులు పద్ధతి మార్చుకోవాలన్నారు. కేసులు చేస్తే భయపడేది లేదని, ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బహిరంగ సమావేశాల్లో హోదా పదాలను ఉపయోగించి మాట్లాడాలని సిల్లి పదాలతో మాట్లాడడం వల్ల ప్రజల్లో మక్తల్ ఎమ్మెల్యేగా మంత్రిగా చులకన ఏర్పడుతుందని మాట్లాడే విధానం నేర్చుకోవాలని మంత్రికి సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవర మల్లప్ప, మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ చిన్న హనుమంతు అన్వర్ హుస్సేన్ నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ బోధన పద్ధతులను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 24: జిల్లాలోని గోరి కొత్తపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డిజిటల్ బోధన పద్ధతుల అమలును ఆరా తీశారు. తరగతుల్లో డిజిటల్ బోధన విధానాలు వినియోగిస్తున్న విధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో డిజిటల్ పరికరాలను సమర్థంగా ఉపయోగించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా 9వ, 10వ తరగతులను పరిశీలించి, విద్యార్థులతో పాఠాలు చదివించి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గౌతమ్ అనే విద్యార్థి యూనిఫాం ధరించకపోవడాన్ని గమనించి యూనిఫాం ఎందుకు ధరించలేదని కలెక్టర్ అడగగా, "ఈరోజు నా బర్త్‌డే సార్" అని విద్యార్థి చెప్పడంతో ఆ విద్యార్థికి జిల్లా కలెక్టర్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, అతనిని అభినందించి భవిష్యత్తులో మంచి విద్యార్థిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధనా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ రాం ప్రసాద్, పాఠశాల హెచ్ ఎం తదితరులు పాల్గొన్నారు.

ఏరిస్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 24 : ఏరిస్ కంపెనీ వారి 56వ వార్షకోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం నర్వ మండలం లోని రాయికోడ్ గ్రామంలో నిఖిత్ టేడర్స్ దగ్గర రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో పంటల సాగుకు సంబంధించిన సూచనలు సలహాలుఇచ్చారు. పంట పొలాల్లో వచ్చే రోగాలకు వాడాల్సిన మందులు, పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో ఏరిస్ కంపెనీ ప్రతినిధులు పవన్ యాదవ్,నరేష్ రెడ్డి, శివతేజ నిఖిల్ ట్రేడర్స్ యజమాని కే రాజశేఖర్, గ్రామ రైతులు నారాయణరెడ్డి, గొల్ల రవి, పింజర మౌలాలి, ఉప్పరి నరేష్, పింజరి కాసిం, దావలి హనుమంతు, ఎర్ర నారాయణ, కావలి అంజి, లంకాల జయన్న, పేరూరు చంద్రప్ప, గడ్డమీది బాలప్ప, నర్సింలు, రామాంజనేయులు గౌడ్, రాజారాం, పుల్లరి రాజు తదిరులు ఉన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

- రూ.50 కోట్లతో రాష్ట్రానికే తలమానికంగా పాఠశాల, కళాశాల నిర్మాణం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్, బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ
- పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే. మేఘా రెడ్డి, కలెక్టర్.ఆదర్శ్ సురభి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 24: సీఎం రేవంత్ రెడ్డి సారథ్యం లోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని మరికుంట మెడికల్ కాలేజీ సమీపంలో 20 ఎకరాలలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో నూతన ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చదువుకున్న పాఠశాల,కళాశాలను రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లతో నూతన భవనాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.ప్రస్తుతం నిర్మించబోయే కొత్త ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం వనపర్తిలో ఉన్న చారిత్రక రాజభవనం నిర్మాణ శైలిని పోలి ఉంటుందని అన్నారు.రాబోయే సంవత్సర కాలంలో ఈ పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే విధంగా పనులు ముమ్మరం చేయాలని కాంట్రాక్టర్కు సూచించారు.వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,నాయకులు సాయి చరణ్ రెడ్డి, కృష్ణ, చీర్ల చందర్, పాకనాటి కృష్ణ, సత్యం సాగర్, పరుశురాం, ఎస్ఎల్ఎన్.రమేష్, బ్రహ్మం, మధు సూదన్ రెడ్డి, ఎత్తం రవి ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ రూరల్ డివిజనల్ ఇంజనీర్గా బాధ్యతలు స్వీకరించిన బక్క దానయ్య

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 24 :హనుమకొండ రూరల్ డివిజన్ ఏడీఈ గా పనిచేస్తూ పదోన్నతి పొంది వరంగల్ రూరల్ డివిజనల్ ఇంజనీర్గా బక్క. దానయ్య డి ఈ ఈ గారు 24.11.2025 రోజున పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బక్క. దానయ్య డిఇ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించుటకు కృషి చేస్తానని, వినియోగదారులకు విద్యుత్ విషయంలో కిందిస్థాయిలో పరిష్కారం కాని ఎటువంటి సమస్యలు ఉన్న తనను నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యోగులందరూ సంస్థ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ రామస్వామి, సెక్రటరీ శ్రీనివాస్, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే ఉపేందర్, కంపెనీ ఉపాధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ భూక్య తౌర్య నాయక్, రాజయ్య వినోద్ కుమార్ రవి, కృష్ణ, గుర్రం. శ్యాం కుమార్, సురేష్ మహేష్ ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు

సేవకుడిలా షాద్ నగర్‌ను అభివృద్ధి చేస్తున్నా

- పదేండ్లు పట్టించుకోని నాయకులు విమర్శిస్తున్నారు
- పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 24: ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను సేవకుడిగా షాద్ నగర్ ను అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ, నేతలు ఏనాడు కూడా ప్రజా సమస్యలను, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. అధికారం పోయిన తర్వాత ఇంటిలో పండుకొని తమ స్వంత సామాజిక మాధ్యమాలలో ఆరోపణలు, ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజలను, అభివృద్ధిని పట్టించుకోలేని ఆ నేతలు నేడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, సమయానుకూలంగా ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తానన్నారు. ఒకటవ వార్డ్ మిలినీయ టౌన్ షిప్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 39.60 లక్షలతో భూగర్భ మురికినీటి కాల్వ పనులను ఆయన సోమవారం నాడు ప్రారంభించారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అది దశలవారీగా కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు గౌస్ ఖాన్, అగ్గనూర్ బస్వం, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, అందే మోహన్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్,మహబూబ్, అన్వర్, మాధవ యాదవ్, మసూద్ ఖాన్,రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, బాలగంగాధర్ తిలక్, సాయికుమార పాల్గొన్నారు.



దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో టీమ్ఇండియా బ్యాటింగ్ ఆర్డర్ సరికాదు. రెండో టెస్టులో సుందర్‌ను ఎనిమిదో స్థానంలో పంపడం సరికాదు. ఈ ఆలోచన అర్థం లేనిది. కోల్‌కతా(తొలి) టెస్టులో నలుగురు స్పిన్నర్లను ఆడించి, వారిలో ఒకరికి ఒకే ఓవర్ ఇవ్వడమూ సరైన నిర్ణయం కాదు. కనీసం స్పెషలిస్టు బ్యాటర్‌తో వెళ్లి ఉండాల్సింది.

- మాజీ క్రికెటర్ రవిశాస్త్రి

ప్రాంతీయం

ప్రొటోకాల్ పాటించని జిల్లా యంత్రాంగం

- కలెక్టర్ కమిషనర్ పై లోక్ సభ స్పీకర్, చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి

ప్రతిపక్షం ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 24: ప్రొటోకాల్ ను పాటించకుండా పెద్దపెల్లి జిల్లా యంత్రాంగం ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం అమానుష మని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి మండిపడ్డారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈఎస్ఐ హాస్పిటల్ స్థల పరిశీలన కోసం వచ్చిన ఎంపీకి కనీస గౌరవం ఇవ్వకుండా అధికారులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. సోమవారం జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో కూడా ఎంపీ పేరును తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్నది ఎవరో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్న అధికారులపై చీఫ్ సెక్రటరీకి, లోక్ సభ స్పీకర్ కు, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాగా, పారిశ్రామిక ప్రాంతంలోని దారి మైసమ్మ ఆలయాల కూల్చివేత ఘటనపై ఇప్పటికీ ఎందుకని క్లారిటీ ఇవ్వడంలేదని నిలదీశారు. ఇందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ఓసిపిల వల్ల జరిగే విధ్వంసంపై గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రొటోకాల్ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదని, జిల్లా కలెక్టర్, కమిషనర్, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ పాల్గొంటారా లేదా అనే కనీసం అడగకుండా ప్రొటోకాల్ పాటించకుండా పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణకు అవమానం కలిగిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని అన్నారు. ఈ మీడియా సమావేశంలో నాయకులు రాచకొండ కోటేశ్వర్లు, నర్సింగ్ దొర, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి

- మహిళా సాధికారితే ప్రభుత్వ ధ్యేయం
- నేడు జిల్లాలోని మహిళలకు 8.80 కోట్ల రూపాయల వడ్డీ డబ్బులు విడుదల
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 24: వడ్డీ లేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని, మహిళా సాధికారిత ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ నాగేష్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,37,438 మంది స్వయం సహాయక బృందాలలో అర్హులైన మహిళలకు వడ్డీ లేని రుణాలకింద 8 కోట్ల 80 లక్షల వడ్డీని బ్యాంకు లింకేజీ పై మహిళల అకౌంట్లో మంగళవారం జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి 8.68 కోట్ల, 2024-25 సంవత్సరానికి 13.01 కోట్ల రూపాయలతో కలుపుకుని ప్రభుత్వం విడుదల చేస్తున్న 8.80 కోట్ల వడ్డితో మొత్తం 30 కోట్ల 40 లక్షల వడ్డీ డబ్బులు వడ్డీలేని రుణాల పథకం కింద మన జిల్లాలో మహిళలకు ఇప్పటివరకు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'నీటిపారుదల' ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 24: నీటిపారుదల శాఖ సమస్యలను సమగ్రంగా పరిశీలిస్తూ పెండింగ్ పదోన్నతులు, బదిలీల ప్రభావం, బిల్లుల క్లియరెన్స్‌పై వెంటనే చర్యలు చేపడతామని రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన టీఎన్జీవో సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ పల్లగుట్టలోని నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శాఖలో నెలకొన్న సమస్యలపై అధికారులతో మాట్లాడారు. 2021లో జరిగిన రీ ఆర్గనైజేషన్ కారణంగా అనేక మంది జూనియర్ అసిస్టెంట్లు ఇతర జిల్లాలకు బదిలీ అవ్వడంతో వారికి గణనీయమైన నష్టం కలిగిందని తెలిపారు. గజ్వేల్ యూనిట్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే అమలు చేయాలని అన్నారు. అదే విధంగా పీఏఓ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను సమర్పించినట్లు, అవి వేగంగా క్లియర్ కావడానికి సంఘం తరపున నిరంతరం ఫాలోఅప్ జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఫెస్టివల్ అడ్వాన్స్, టీజీ ఎల్ ఐ వంటి లోన్స్ , అడ్వాన్స్‌లు త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. కారుణ్య నియామకాల విషయంలో సూపర్న్యూమరి పోస్టులు ఖాళీ అయిన వెంటనే నియామకాలు జరగాలని, అలాగే ఉద్యోగ నియామకం అయిన తేదీ విధివిధానాల ప్రకారం నిర్బంధంగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా టీఎన్జీవోస్ కార్యదర్శి కోమాండ్ల విక్రమ్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు, జరిమానా తప్పదు

- గజ్వేల్ పోలీసుల హెచ్చరిక

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 24: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘిస్తూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా, జైలు శిక్ష రెండూ విధించే ఆస్కారం ఉందని గజ్వేల్ ఇన్స్పెక్టర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, మురళీ పేర్కొన్నారు. ప్రతిరోజు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకై చేస్తున్న సోదాలలో భాగంగా గత వారం రోజులుగా స్థానిక ప్రధాన కూడలిలో గస్తీ నిర్వహించడంతోపాటు మద్యం సేవించిన వాహనదారులపై కేసు నమోదు చేసి జైలు శిక్ష లేదా పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధింప చేస్తున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు

- సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజుకు సత్కారం

ప్రతిపక్షం, విజయవాడ, నవంబర్ 24: మల్లె తీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిసాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ షా ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరై రచయితలు, కార్టూనిస్టులు, కవులు, గాయకులు పలువురిని కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పండితులు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతి రావు (బాషా ప్రవీణ) ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు కలిమి శ్రీ (మల్లె తీగ), సీనియర్ జర్నలిస్ట్ యేమినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్పోరేట్ల ప్రయోజనాల కోసమే 'ఆపరేషన్ కగార్'

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 24: గత 22 నెలలుగా ఆదివాసులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లు ప్రభుత్వ, కార్పోరేట్ హత్యలేనని ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో "ఆపరేషన్ కగార్" వ్యతిరేకంగా నిరసన జరిగింది. వేదిక రాష్ట్ర కన్వీనర్ వంగల సంతోష్ మాట్లాడుతూ గత 22 నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై అక్రమ హత్యలు జరుగుతున్నాయని, అటవీ ప్రాంతాల్లో బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల్లో భయాందోళన సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కార్పొరేట్ ప్రయోజనాల కోసం చేస్తున్న చర్యలేనని చెప్పారు. ఈ ఘటనలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ, మానవ హక్కుల కమిషన్ సుమోటో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో వంగల సంతోష్, కస్తూరిపల్లి ప్రభాకర్, పిడిఎస్ యూ నాయకులు విష్ణు, రాజేష్, శేఖర్, రాజు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు వాహనాల తనిఖీలు తప్పనిసరి

- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి.
- సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 24: ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు సూచించారు. మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్ ను సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆవరణ పరిశుభ్రతపై సూచనలు చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు గురించి కూడా ఎస్‌హెచ్ఓ నుండి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వాహణలో అంకితభావంతో పని చేయాలని సూచించారు. విధులలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. విధుల పరంగా ఎలాంటి సమస్య ఉన్నా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల సమయంలో పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలని, మండలలు, గ్రామాలను సందర్శిస్తూ వీపీఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, వుమెన్ హరాస్మెంట్ వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ జర్జ్, కూల్చారం ఎసై అహ్మద్ మోహినొద్దీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 24: మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత వేగంగా జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారీ నిత్యానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం ఇదే నెలలో 27,938 మంది రైతుల నుంచి 1,33,664.000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 117.58 కోట్ల రూపాయలను చెల్లించగా, ప్రస్తుత సీజన్ కి ఇప్పటివరకు 49,027 మంది రైతుల నుండి 2,00,334.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 323.04 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. నేటికి సన్నధాన్యం 5008 రైతులకు 11.56 కోట్ల రూపాయలు బోనస్ చెల్లింపు పూర్తి చేశామని ఈ సందర్భంగా తెలియజేశారు.

సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ అరెస్టు అక్రమం

- రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాములు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 24: రాష్ట్రంలో 16,000 మంది రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదల కోసం పోరాటం చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ ని పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పోనమల్ల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగిరెడ్డిలు తీవ్రంగా ఖండించారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా జడ్సన్ నిరంతరం వీడియోలు విడుదల చేస్తూ, వివిధ వేదికలపై నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం రాష్ట్ర గవర్నర్ అపాయింట్మెంట్ కోసం రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయనను శాంతియుత నిరసన సమయంలో పోలీసులు అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల కాకపోవడంతో శారీరక, మానసిక, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించిన విషయాన్ని అసోసియేషన్ నాయకులు ఆవేదనతో వ్యక్తం చేశారు. జడ్సన్ అరెస్టును ఖండిస్తూ ప్రభుత్వం వెంటనే ఆయన్ని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 27 న ఉదయం 10 గంటలకు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ముందు రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విడుదల కోసం జరగనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

వెట్ ల్యాండ్ సంరక్షించడం ఒక సామాజిక బాధ్యత

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 24: వెట్ ల్యాండ్ ను సంరక్షించడం ఒక సామాజిక బాధ్యతగా మెలగాలని జిల్లా కలెక్టర్ హైమవతి పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వెట్ ల్యాండ్ మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యకతన జరిగింది. సుప్రీం కోర్టు దేశం మొత్తంలో ఉన్న వెట్ ల్యాండ్ సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని, దీనికి సంబంధించి జిల్లాలో 8 చెరువులు ఎంపిక చేసినట్లు ఆ చెరువుల మొత్తం విస్తీర్ణం డిజిటల్ మ్యాపింగ్, లోతు, వర్షపాతం, చేపల సామర్థ్యం, గ్రౌండ్ వాటర్, చెరువు భూ రికార్డు పరిశీలన, నీటి నాణ్యత అన్ని వివరాలు అటవీ, నీటిపారుదల, మత్స్య శాఖ అధికారులు సమన్వయం అన్ని వివరాలు సేకరించి చెరువును సంరక్షించి పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలనీ తెలిపారు. వెట్ ల్యాండ్ ను సంరక్షించడం ఒక సామాజిక బాధ్యత గా మెలగాలనీ, నీరు కలుషితం కాకుండా, ప్రకృతిని కాపాడడం లో అందరూ భాగస్వామ్యం కావాలని అధికారులను ఆదేశించారు. అడవులను నరికివేయకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని అటవీ శాఖల అధికారులను ఆదేశించారు. అంతకుముందు డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ మీటింగ్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ జిల్లాలో యువత కి ఉద్యోగ ఉపాధి అందించడం కోసం పరిశ్రమలు స్థాపన ముఖ్యమైనదని టీజీ ఐ పాస్ లో వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు పెట్టుకున్న అన్ని ఆయా డిపార్ట్మెంట్ వారిగా వెరిఫై చెయ్యాలని ఒకవేళ యూనిట్ నెలకొల్పడానికి సుముఖంగా లేనియెడల డిలీట్ చెయ్యాలని తెలిపారు. అలాగే అన్ని పరిశ్రమల్లో కార్మికులకు ఇన్స్యూరెన్స్ చేయించాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, పరిశ్రమ అధికారి గణేష్ రామ్, మత్స్య శాఖ అధికారి మల్లేశం, నీటి పారుదల ఈ ఈ నాగరాజు, డి ఏ ఓ స్వరూప రాణి ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా వెంకన్న ఆలయ నూతన కమిటీ ఎన్నిక

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 24: పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ శాశ్వత సభ్యుల సమావేశం సోమవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ గా టీఎండీ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి కిషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థంగా ఆలయ అభివృద్ధి కోసం పనిచేసి, ఆ కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి కృపకు పాత్రులమవుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికైన నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధిలో ప్రత్యేక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



ఐబొమ్మ రవి రాబిన్‌హుడ్ హీరో అని ప్రజలు అనుకుంటున్నారు. టికెట్ ధరలు పెంచి దోచుకోవడం తప్పనే భావనలో ప్రజలు ఉన్నారు. రూ.1000 కోట్లు పెట్టి తీస్తే బాగుపడేది హీరో, డైరెక్టర్, నిర్మాత. ₹50–-100Cr పెట్టి తీయలేరా అని ప్రశ్నిస్తున్నారు. తప్పు చేసిన వ్యక్తిని శిక్షించాలని మరికొందరు అంటున్నారు. న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇస్తుందో వేచి చూడాలి.

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్

'మానేరు' చెక్ డ్యామ్
ఘటనపై సమగ్ర విచారణ

- **కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం**
- **ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 14: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్, జమ్మికుంట పట్టణ పరిధిలోని తనుగుల గ్రామ శివారులో మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించింది. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నవంబర్ 21వ తేదీ రాత్రి సమయంలో ఈ చెక్ డ్యామ్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఘటన నీటి ప్రవాహానికి సహజంగా జరిగిందా? లేక ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా విధ్వంసానికి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థల పరిశీలనలో భాగంగా అధికారులతో పాటు హైదరాబాద్ నుండి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ నేతృత్వంలోని బృందం, కరీంనగర్ క్లూస్ టీం సభ్యులు, ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్లు రాజు, స్వర్ణజ్యోతి అక్కడ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హుజురాబాద్ ఏసీపీ మాధవి, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ గౌడ్, లక్ష్మీనారాయణతో పాటు ఎస్సైలు శేఖర్ రెడ్డి, ఆవుల తిరుపతి , నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పాలన అసోసియేషన్
రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కమలాకర్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 24: గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చి రెడ్డి సమక్షంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా వి లచ్చిరెడ్డి, సలహాదారులుగా కే. రామకృష్ణను సైతం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యవర్గంలో సిద్దిపేట జిల్లా నుండి మద్దెల కమలాకర్ ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమలాకర్ పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సిద్దిపేట జిల్లా నుండి అంబిగల్ల ఆనందం, ఆరుట్ల బాలయ్య, రవీందర్, కృష్ణ, శ్రీనివాస్, స్వామి, నరసింహులు, వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ 26న ధర్నా

- **కార్మిక సంఘం నేతలు గోపాలస్వామి, లక్ష్మణ్, అరవింద్**

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, నవంబర్ 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడులను, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని 26న దేశవ్యాప్తంగా జరుగు కార్మిక, రైతు సంఘాల నిరసన ప్రదర్శన ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు అరవింద్ పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలోని కార్మిక కర్షక భవన్ సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్టీయూ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా నాలుగు కార్మిక కోడులను తయారు చేసిందని అన్నారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. దీంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భద్రత సంక్షేమం ప్రమాదం పొంచి ఉందని అన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనిలో ఆన్లైన్ విధానం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మిక రైతాంగ రక్షణ కోసం జరిగే ప్రదర్శన ధర్నాలో కార్మికులు రైతాంగం ఉపాధి కూలీలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, కోశాధికారి భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సంపత్, బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

- **26 నుండి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర**
- **డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి**

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 24: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకి ప్రాణం పోసిన రాజ్యాంగ ముసాయిదా చేపట్టిన చారిత్రాత్మక దినం నవంబర్ 26, అలాగే జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబెడ్కర్ ని స్మరించుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి అన్నారు. డీబీఎఫ్ అధ్వర్యంలో అర్ అండ్ అర్ కాలనీలో సోమవారం దాసరి ఏగొండ స్వామి, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, మండల అధ్యక్షులు ఉషగారి చంద్రంతో కలిసి సింగారం అంబేడ్కర్ విగ్రహం వద్ద 26 బుధవారం నుండి జనవరి 26 వరకు జరిగే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలందరు జరుపుకొవాలని, ప్రతి పాఠశాలలో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ సమయంలో చదివించాలని సూచించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్నికాపాడుకుంటూ సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

ఎన్టీపీసీ అవినీతి అక్రమాలపై నిజనిర్ధారణ జరపాలి

- **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి**

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 24: ఎన్టీపీసీ కుందనపల్లి యాష్ ప్లాంట్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, బూడిద దందా దౌర్జన్యాలపై నిజనిర్ధారణ జరపాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి అన్నారు. పర్మిషన్ పొందిన మిషన్లను యాష్ ప్లాంట్లో అనుమతించకపోవడం అన్యాయమని ఖండించారు. ఈ మేరకు సోమవారం మొగల్ పహాడ్ గ్రామ భూ నిర్వాసితులతో కలిసి గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుమ్మడి కుమారస్వామి, మొగల్పహాడ్ బాధితులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకున్న మిషిన్లను క్వారీలోకి రాకుండా అడ్డుకోవడం అమానుషమని మండిపడ్డారు. స్థానిక పోలీస్ అధికారులు అత్యుత్సాహంతో అక్రమార్కులకు అండగా నిలుస్తుండడం సరైంది కాదని సూచించారు. దళితులన్న చిన్న చూపుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై నేషనల్ హెచ్ఆర్సీకి, ఎస్సీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. యాష్ ప్లాంట్ లో జరిగే అక్రమాలు, దౌర్జన్యాలపై నిజనిర్ధారణ జరిపేందుకు మేధావులు, పౌర సమాజం,విప్లవ కార్మిక సంఘాలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.కాగా, 600 ఎకరాల భూమిని కోల్పోయిన కుందనపల్లి గ్రామస్తుల మిషన్ ను యాష్ ప్లాంట్ లోకి అనుమతించి, అదే స్థాయిలో 600 ఎకరాల భూమిని కోల్పోయిన మొగల్పహాడ్ గ్రామస్తులకు చెందిన మిషన్ ను అనుమతించకపోతుండడం ఎంతవరకు సమంజసం అని చిలుక రాజేశం అనే గ్రామస్తుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వాపోయారు. అంతర్గాం ఎస్ఐ వెంకటేష్,ఎన్టీపీసీ పోలీసులు ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉంటూ గ్రామస్తులపై బెదిరింపులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సమంజసంగా లేదని అన్నారు. దళితులకు సంబంధంలేని ఏబీసీ రెడ్డి బూడిద దందాలో అవినీతి కుంభకోణాలకు పాల్పడుతూ ఎమ్మెల్యే చెప్పు చేతల్లో ఉన్నారని, ఏబిసి శ్రీనివాస్ రెడ్డి బూడిద దందాలపై నిజ నిర్ధారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కుందనపల్లి యాష్ ప్లాంట్లో బూడిద దందాపై జాతీయ ఎస్సీ కమిషన్, పౌరహక్కుల కమిషన్ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో మొగల్పహాడ్ గ్రామస్తులు ప్రవీణ్, చిలుక శ్రీనివాస్,లింగయ్య,సాయి వినోద్,సాయికుమార్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యం
'సప్తశక్తి సంగం'

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 24: స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ హై స్కూల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'సప్తశక్తి సంగం' కార్యక్రమం సుమారు 200 పైగా మహిళల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఆనఘా వేంకటలక్ష్మి, వల్లూరు అలివేలు మంగ తమ విలువైన సందేశాలతో అందరిలో ప్రేరణ నింపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా చొప్పరి జయశ్రీ, వకుళాదేవి, లెక్కల రమ పాల్గొన్నారు. రామోజు ధనలక్ష్మి సభాధ్యక్షులుగా పాల్గొని మహిళా శక్తి, పర్యావరణ రక్షణ వంటి అంశాల మీద తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆచార్య బృందం, తల్లులు, విద్యార్థులు మరియు కమిటీ కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు,శైక్షనిక ప్రముఖ్ కాటం రవీందర్ మరియు సిబ్బందికి ప్రధానాచార్య సముద్రాల రాజమౌళి ధన్యవాదాలు తెలియజేశారు.

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- **ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున**
- **అభివృద్ధి పనులు, ఇళ్ల మంజూరు ప్రక్రియలో వేగం పెంచాలి**
- **జిల్లా కలెక్టర్ హైమావతి**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 24: అకాల వర్షాల నేపథ్యంలో పంటలు, ధాన్యం రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అలాగే ముఖ్యమంత్రి పర్యటన, అభివృద్ధి పనులు, ఇళ్ల మంజూరు ప్రక్రియలో వేగం తీసుకురావాలని కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఐడిఓసీ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు పలు సూచనలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో నాలుగు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వర్షాల ప్రభావం వల్ల పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం తడవకుండా ఉండేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా లేదో ప్రత్యేకంగా పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలో అతి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా పలు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసే అవకాశం ఉన్నందున, ఏర్పాట్లను సంబంధిత అధికారులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో చేపట్టాలని కలెక్టర్ వెల్లడించారు. అంగన్వాడీ, గ్రామపంచాయితీ భవనాల నిర్మాణాల కోసం ఇప్పటికే కేటాయించిన స్థలాల్లో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను కోరారు.

వడియారం హత్య కేసును అట్రాసిటీ కేసుగా మార్చాలి

- **అడిషనల్ ఎస్పీకి డీబీఎఫ్ వినతి**

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 25: చేగుంట మండలం వడియారం గ్రామంలో దళిత యువకుడు మోహన్ను పెట్రోల్ పోసి తగలబెట్టిన కేసును అట్రాసిటీ కేసుగా నమోదు చేయాలని డీబీఎఫ్ నాయకులు మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ కు వినతి పత్రం అందజేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ సమక్షంలో అడిషనల్ ఎస్పీని కలిశారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం జంగారాయి గ్రామానికి చెందిన బందెల మోహన్ వడియారం గ్రామంలో బైక్ దొంగతనం చేశారని బీసీ వర్గానికి చెందిన కొంతమంది మోహన్ ను స్తంభానికి కట్టివేసి పెట్రోల్ పోసి నిప్పటించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చికిత్స పొందుతూ మరణించిన మోహన్ కేసును కేవలం హత్య కేసు మాత్రమే నమోదు చేశారన్నారు. అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులు యాదమ్మ దేవయ్య పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆంక్షారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 24: గత రెండు రోజుల క్రితం సిద్దిపేట డీసీసీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన తుంకుంట ఆంక్షా రెడ్డి, తండ్రి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి సోమవారం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు ఇద్దరు నేతలను అభినందిస్తూ, జిల్లా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం వారు జిల్లా స్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పార్టీ పట్టణ, గ్రామ స్థాయి బలపర్చే కార్యక్రమాలు, కార్యకర్తల ఐక్యతపై విస్తృతంగా చర్చించారు. ఇదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొడిప్యాక నారాయణ, గాడిపల్లి శ్రీనివాస్, చిట్కుల శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్లను వెంటనే రద్దు చేయాలి

- **విప్లవ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్**

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 24: కార్మికుల హక్కులను హరించే వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విప్లవ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఐ కృష్ణ వెంకన్నను డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు గా మార్చిన కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ 8 గంటల పని దినాన్ని 12 గంటలు చేసే ప్రయత్నం చేస్తుందని, వేతనాలు కోల్పోయే విధంగా కార్మికుల హక్కులను ధరించే విధంగా ఉన్నాయని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకునేంతవరకు కార్మిక వర్గం ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని, మంగళవారం జరిగే నల్ల బ్యాడ్జిల్లా నిరసన కార్యక్రమంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు ఉపసంహరించుకునేంతవరకు ఆందోళన ఉద్యమ కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు కేంద్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఎఫ్టీయూ, ఏఐఎఫ్టీయూ, టీఎన్టీయూసీ విప్లవ జేఏసీ సంఘాల నాయకులు ఐ కృష్ణ, వెంకన్న,రాములు, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీలకు రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతాం. ఆయన వెంటనే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలి. బీజేపీ సహకరించకుంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టాలి. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ బీసీల విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42% రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కనపెట్టారు.

- కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

ప్రాంతీయం

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- ప్రత్యేక పాలసీ రూపకల్పన
- మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్-24: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్ లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక పోతున్నాయని, దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వీరికి జూబ్లీహిల్స్ మహిళలు కర్రు కాల్చి వాత పెట్టారని మంత్రి తెలిపారు. గత 10 సంవత్సరాల పాలనలో వడ్డీ లేని రుణాలు అందించాలనే ఆలోచన పాలకులకు రాలేదని, మన ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజ్ ద్వారా వడ్డీలేకుండా మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొదటి ఏడాది వడ్డీ లేని రుణాలు కింద 9 కోట్ల రూపాయలు విడుదల చేసామని, ప్రస్తుత సంవత్సరం మరో 10 కోట్ల రూపాయలు విడుదల చేయబోతున్నామని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా పారిశ్రామిక వాడలలో భూముల కేటాయింపుకు ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ ఆర్డీఓ గంగయ్య, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, తహసిల్దార్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయంగా శాతవాహన స్నాతకోత్సవం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ అభినందన
- విశ్వవిద్యాలయ కులపతిని కలిసిన ఉపకులపతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 24: శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణు దేవ్ వర్మని కలిసి విశ్వవిద్యాలయానికి రెండవ స్నాత్తకోత్సవం జరుపుకోవడానికి అనుమతిచ్చి, స్వయంగా హాజరైనందుకు, స్నాతకోత్సవము విజయవంతం అయినందుకు ధన్యవాదాలు తెలిపి జ్ఞాపిక ను బహుకరించారు. ఈ సందర్భంగా కులపతి శ్రీ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ స్నాతకోత్సవ ఏర్పాట్లలో ఎలాంటి లోపం రాకుండా అద్వితీయంగా నిర్వహించారని కితాబిచ్చారు. స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలించినందుకు ఉపకులపతి ఉమేష్ కుమార్ ని, విశ్వవిద్యాలయ సిబ్బందికి అభినందనలు తెలియజేసి విశ్వవిద్యాలయాన్ని బోధనలో, పరిశోధనలలో, అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లాల్సిందిగా తెలంగాణలో మేలైన విశ్వవిద్యాలయంగా పేరు తీసుకురావాలని సూచించారు.

మహిళల ఆర్థిక స్థిరత్వమే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్-24: మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో రైతు వేదిక వద్ద ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ 850 కుట్టు మిషన్లతో మంథని ప్రాంతంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో 21 ఉచిత కొట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. కుట్టు మిషన్ కేంద్రం ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మారంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్-24: మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మారం మండలంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ధర్మారం మండల మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో 36 లక్షల తో బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారా నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లా నాయక్, వైస్ చైర్మన్ లింగయ్య, ఎంపీడీవో ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ కుమార్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు,ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను వెంటనే ఉపసహరించాలి

- లేకుంటే ఆందోళనలు ఉధృతం
- నిరవధిక సమ్మెకు సిద్ధం
- సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. లేనియెడల భారీ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ నాయకులు రాజ్ కుమార్,తుమ్మల రాజారెడ్డి, వడ్డేపల్లి దాస్,మాదాసు రామ్మూర్తి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. పార్లమెంటులో బలం ఉందని అప్రజాస్వామిక,కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి అమలుపరిచే కుట్ర చేస్తోందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న హక్కులను హరించి కార్మికుల భవిష్యత్తుకు భద్రత లేకుండా చేసే ఈ లేబర్ కోడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా మంగళవారం నుండి నిరసన కార్యక్రమాలు చేపడతామని,అయినప్పటికీ ప్రభుత్వం దిగిరానియెడల నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. జేఏసీ చేపట్టే నిరసన, ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ మీడియా సమావేశంలో జెఎసి నాయకులు మద్దీ ఎల్లా గౌడ్, అరెల్లి.పోషం, కే.సదానందం, చల్పూరి సతీష్, రోడ్డ సంపత్, సారయ్య, రాజమౌళి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'హలో మాల.. చలో ఢిల్లీ'

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 24: ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీలలో జరిగే రాజ్యాంగ హక్కుల సాధన సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి మాల మహానాడు నాయకులు బయలుదేరి వెళ్లారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిశోర్, జిల్లా మీడియా ఇంచార్జ్ జాల శ్రీనివాస్, సుంకే రమేష్, డ్యాగల సతీష్, మహేందర్, వేరంగి సాయి పరమేష్, బురికి జాల రాజయ్య, వెన్న రాజు రాష్ట్ర ప్రధానకార్యదర్శి తరలివెళ్లారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం

- మహిళలకు ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- రాజీవ్ గాంధీ మహిళా భవన్ శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 24: రామగుండం నియోజకవర్గం అంతర్గం మండలం ప్రధాన చౌరస్తా లో సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ రెండు కోట్లతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ మహిళ భవన్ కు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఆయన సతీమణి మనాలి ఠాకూర్ లు మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళా ఆర్థికాభి వృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర మహిళలందరూ మా ఆడబిడ్డలే అని కొనియాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేయడం జరిగిందని, గత ప్రభుత్వం నాసి రకపు చీరలను మహిళలకు అందజేసి వారిని మోసం చేశారని విమర్శించారు. ఆడబిడ్డల చేతిలో డబ్బులు ఉంటే పొదుపు దిశగా ఆలోచిస్తుందని ఇతరులకు అప్పు ఇచ్చే విధంగా ఎదుగుతారని అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో మహిళా సమాఖ్యాల ద్వారా ప్రతి మహిళకు చేరుతాయని అన్నారు. మహిళలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు,మహిళా మణులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ ఆసుపత్రులకు సంజయ్ సాయం

- రూ.4 కోట్ల వైద్య పరికరాలను అందించిన బండి
- జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఆసుపత్రులకు వైద్య పరికరాల అందజేత

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, హుస్నాబాద్, నవంబర్ 24: 'ప్రభుత్వ ఆసుపత్రులుకు వచ్చే పేద రోగులను టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపొద్దు. వారిపై భారం మోపద్దు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేదే పేదలు. వారికి రూపాయి ఖర్చు లేకుండా పూర్తి చికిత్స చేసి పంపేలా చర్యలు తీసుకోండి.' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమర్ కోరారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ ఆసుపత్రికి దాదాపు కోటి రూపాయల అత్యాధునిక వైద్య పరికరాలను సీఎస్సార్ నిధుల ద్వారా కొనుగోలు చేసి అందించారు. ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్(లార్జ్), డయా థెర్మా మిషన్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫెటల్ మానిటర్ సహా మొత్తం 15 వైద్య పరికరాలను అందించారు. ఆయా పరికరాల సేవలను సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రారంభించారు. హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులను కూడా సందర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు టెన్త్ క్లాస్ చదివే దాదాపు 20 వేల మంది విద్యార్థులకు ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన సంగతి తెలిసిందే. త్వరలోనే 9వ తరగతి విద్యార్థులకు సైతం సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్) రూ.4 కోట్ల నిధులను సేకరించి వేములవాడ, జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను కొనుగోలు చేసి అందించారు. వేములవాడలో రూ.1.5 కోట్ల వ్యయంతో దాదాపు 16 వైద్య పరికరాలను అందించిన బండి సంజయ్ ఇటీవల వేములవాడ పర్యటనలో భాగంగా ఆ ఆసుపత్రిని సందర్శించి ఆయా వైద్య సేవలను ప్రారంభించారు. తాజాగా కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు ఒక్కో ఆసుపత్రికి రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేసి అందించారు. గతంలో కరీంనగర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి సైతం తన బర్త్ డే కానుకగా దాదాపు రూ.3 కోట్ల విలువైన అంబులెన్సులు, ఎక్స్ రే మిషన్ సహా అత్యాధునిక వైద్య పరికరాలను బండి సంజయ్ అందించిన విషయం తెలిసిందే.

సూది, మందులు, దూది లేదు

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఆసుపత్రుల్లో సూది, మందులు, దూది కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో పెద్ద ఎత్తున నిధులను సరిగా వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆసుపత్రికి వెళితే సూదులు, మందులు, దూది కూడా లేని పరిస్థితి ఏర్పడిందని, ప్రజలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేకుండా పోతోందని అన్నారు.

కుక్క కాటుకు మందు లేదు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కూడా మందు అందుబాటులో లేని దుస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వాళ్లంతా పేద, మధ్య తరగతి ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకోలేని వాళ్లే. సూది మందుతోపాటు కనీస సౌకర్యాల్లేక పోతే పేదల పరిస్థితి ఏంది? చావాల్సిందేనా?" అని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఎన్ ఎండీసీ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధులతో దాదాపు రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 24 : "మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి" కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐ.కే.పీ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న తీరును తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి పారదర్శకంగా, సజావుగా జరగాలని అన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెలంగాణ సంప్రదాయాన్ని అనుసరిస్తూ గౌరవ ప్రదమైన రీతిలో ప్రభుత్వం తరపున మహిళలకు చీరను అందించాలని సూచించారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా, అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను వేగంగా చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాద్రి, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

"



ప్రజాగ్రహం నుంచి చంద్రబాబును కాపాడేందుకు పవన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. రైతులకు మద్దతు ధర, నష్టపరిహారం కోసం పోరాడాల్సిందిపోయి.. పొలిటికల్ డ్రామాలోకి తిరుమలను, లడ్డూ ప్రసాదాన్ని తీసుకొచ్చారు. తప్పుడు ప్రచారం, ప్రజలను నమ్మించడంలో చంద్రబాబు, పవన్ నిపుణులు. గోబెల్స్‌ను మించిపోయారు.

-ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రాంతీయం

విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా
విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య

- **రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 24 : విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుందని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో 13.50 లక్షల వ్యయంతో నెలకొల్పిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను మంత్రి జూపల్లి, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో కలిసి ప్రారంభించారు. విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించిన మంత్రి, ల్యాబ్ లోని పరికరాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పెంపుదల కొరకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థుల పరిజ్ఞానం పెంపొందడమే కాకుండా, వారిలో విజ్ఞాన శాస్త్రం పై జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్న కుతూహలం పెరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈ ల్యాబ్ ను చక్కగా ఉపయోగి, వారి పరిజ్ఞానం పెరిగేలా బోధనలు జరపాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ల్యాబ్ లో పొందుపరిచిన పరికరాల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతుందని అన్నారు.

విద్యార్థులకు పరిజ్ఞానం అందించేందుకే విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల ఏర్పాటు:

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

విద్యార్థులకు సైన్సు పట్ల పరిజ్ఞానం పెంపొందేలా విద్యాబోధన అందాల అన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను నెలకొల్పుతున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ ల్యాబ్ ల ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన అలవరుతోందని వివరించారు. అంతకుముందు, 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పాఠశాలకు సంబంధించి, పలు మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తులకు సంబంధించిన పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కలెక్టర్, తదితరులు భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి అధికారులు విద్యార్థులు పుష్పగుచ్చాలను ఇచ్చి, ఎన్ సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, డీఈవో భోజన్న, జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి కార్మికుల మెడపై లేబర్‌కోడ్ కత్తి

- **కొత్త సంఘాలు లేనట్టే.. హక్కులకు విఘాతం**
- **ఉద్యోగుల హక్కులకూ నష్టం అంటున్న సంఘాలు**
- **ఇప్పటికే సీఐటీయూ ఆందోళనలు**
- **దేశ వ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు**

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల

కేంద్రం ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన లేబర్‌కోడ్లు సింగరేణిలో కార్మికులు, ఉద్యోగుల మెడపై కత్తి వేలాడనుంది. నూతన నాలుగు కోడ్లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఆందోళన చేయడంతో ఐదేళ్లు అమలు చేయకుండా నిలిపివేశారు. అయితే మూడు రోజుల క్రితం అమలు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీంతో కార్మిక హక్కులు కాలరాయబడతాయని, కార్మికుల సంక్షేమం అటకెక్కుతుందని కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కోడ్ల వల్ల కొత్త కార్మిక సంఘాల ఏర్పాటు కూడా ఇక నుంచి కష్టమేనని చెబుతున్నారు. ఈ కోడ్ల అమలుతో కార్మికుల, ఉద్యోగుల హక్కులకు భంగం వాటిల్లుతుందని చెబుతున్నారు. ఇప్పటికే లేబర్‌కోడ్లను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘం సీఐటీయూ ఆందోళన బాటపట్టింది. సింగరేణి అన్ని గనుల డిపార్టుమెంట్ల వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తెరపైకి తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రక్రియకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకోవడం సరికాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత ఉండదని, 1886 చికాగోలో 8 గంటల పని దినం కోసం పోరాడి ప్రాణార్పనం చేసిన అమలరుల త్యాగాల ఫలంగా ఏర్పడిన కార్మిక హక్కు కూడ కాలగర్భంలో కలిసి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత వర్తించే నికర నిధి 12 నుంచి 10 శాతం వరకు కుదించబడుతుందని తెలిపారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ఉండదని, సింగరేణిలో ఇక సమ్మెలు ఉండవని, కార్మిక సంఘాలకు కూడ మాట్లాడే అవకాశాలు సన్నగిల్లుతాయని, అంతే గాకుండా కార్పొరేట్ విధానం పెద్దమొత్తంలో జరుగుతుందని ఈ కోడ్‌ల అమలు పూర్తిగా పారిశ్రామిక భద్రతకు విఘాతమే అని తెలిపారు. రానున్న రోజుల్లో దీనికి సంబంధించి దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సింగరేణిలో సంఘాలన్ని దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు.

భర్తపై డీజిల్ పోసి చంపిన భార్యలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 24 : భీమ్‌గల్ మండలం దేవక్కపేట గ్రామంలో కుటుంబ కలహాలతో ఇద్దరు భార్యలు భర్తను కడతేర్చి పారిపోయిన ఘటన చోటు చేసుకుంది. దేవక్కపేట్ గ్రామానికి చెందిన మాలవత్ మోహన్(38)కు ఇద్దరు భార్యలు ఐదుగురు కూతుళ్లు. భార్యలు నిత్యం భర్త తో తరచూ ఇంట్లో గొడవ పడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో మోహన్ సోమవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుర్చీపై నిద్రపోతుండగా ఇదే అదనుగా భావించిన తన ఇద్దరు భార్యలు అతడిపై పెట్రోల్ పోసి పక్కనే ఉన్న పొయ్యిలోంచి నిప్పు తీసి అంటించారు. దాంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం భార్యలు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న భీంగల్ ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి అన్న రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ స్వప్నం

- **మంత్రి జూపల్లి కృష్ణారావు**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 24 : కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ స్వప్నమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం రాత్రి బైంసాలోని శ్రీ గౌరీ శంకర్ ఫంక్షన్ హాలులో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవం నిలబెట్టాలన్న ఉద్దేశంతో, 'మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి' పేరుతో ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని అన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజల సర్వతో ముఖాభివృద్ధి ధ్యేయంగా ఎన్నో పథకాలను అమలు పరుస్తుందని అన్నారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, వంటి ఎన్నో పథకాల ద్వారా ప్రజల అభివృద్ధి సహకారం అవుతుందని అన్నారు. మహిళలకు అద్దె బస్సులను మహిళా సంఘాల ద్వారా అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అన్ని హామీలను నెరవేరుస్తుందని వివరించారు. ముమ్మందు లబ్ధిదారులందరికి ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

నేడు వడ్డీ లేని రుణాల పంపిణీ

- **కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి**
- **విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 24 : జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో మంగళవారం స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని సెగ్మెంట్లలో ఏకకాలంలో పండుగ వాతావరణంలో జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయం నుండి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవరాజన్ తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన (మంగళవారం) అన్ని సెగ్మెంట్లలో వడ్డీ లేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఐ.కే.పీ ఏపీఎంలు, సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వారికి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో గల 21,996 స్వయం సహాయక సంఘాలకు రూ. 23.26 కోట్లు వడ్డీ లేని రుణాల కింద పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఐ.కె.పీ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, ఐ.కె.పీ అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అన్ని నియోజకవర్గాల్లో వడ్డీ లేని రుణాల పంపిణీ

- **వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 24: రేపు 25 వ తేదీన మంగళవారం నియోజక వర్గాల వారిగా వడ్డీ లేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి నియోజక వర్గంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వారికి ముందుగానే సమాచారం అందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క సూచించారు. సచివాలయం నుండి సోమవారం సాయంత్రం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవరాజన్ తదితరుల తో కలిసి అయన ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గాల వారీగా వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలోని నియోజక వర్గాలలో రేపు మంగళవారం రోజున స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో తదితరులు పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో ఘరానా మోసం

- **ఇద్దరు నిందితుల అరెస్ట్**
- **150 మందికి చెందిన రూ. 75 లక్షలు మాయం**
- **పోలీస్ కమిషనర్ వెల్లడి**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 24 : ఎల్జీ (లక్కి జనరల్స్) ఇండియా జాబ్ మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో మరో మోసం వెలుగు చూసింది. దాదాపు 150 మంది ఈ కంపెనీ లో పెట్టుబడి రూ. 75 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు కు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు నెలల క్రితం నిజామాబాద్ వివి నగర్ కాలనీ ముబారక్ నగర్ కు చెందిన మేకల జగదీష్, పెద్ద బోయిన భూమయ్య అలియాస్ ప్రేమ్ రెంజల్ మండలం సాటాపూర్ కు చెందిన వ్యక్తి ద్వారా పిట్ల మధు తో ఎల్ ఇండియా కు సంబంధించిన యాప్ లో రూ.25,500 జమ చేయించారు. అనంతరం ఎల్జి ఇండియా కు సంబంధించిన వీడియోలు రోజుకి 16 చొప్పున చూస్తే ప్రతి వీడియోకు రూ. 55 లు వస్తాయని నమ్మించి ప్రతి రోజు దాదాపు రూ. 880 సంపాదించవచ్చుని నమ్మించారు. ఈ కంపెనీలో డబ్బులు పెడితే కంపెనీ యాడ్స్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని, అలాగే ఈ కంపెనీ లో తాను లీడర్ గా మారి ఇతరులను జాయిన్ చేస్తే దానికి గాను అదనంగా 8 మందికి రూ.4 వేలు, 15 మందికి రూ. 8 వేలు వస్తాయని చెప్పటంతో మధు యాప్ లో డబ్బులు పెట్టాడు. అదే విధంగా ఏజెంట్ల మాయమాటలు నమ్మిన మధు అతని రక్త సంబంధులకు, తెలిసిన వ్యక్తులకు ఇందులో పెట్టుబడి పెట్టించాడు. మొదట్లో ఆప్ లో డబ్బులు వస్తున్నట్లు ఎల్జీ వాలెట్లో జమ ఐతున్నట్లు కనిపించటంతో, ప్రేమ్, మేకల జగదీష్‌లు దాదాపు 150 మంది వ్యక్తులను నమ్మించి ఎల్జీ కంపెనీ లో డబ్బులు పెట్టించారు. వాలెట్లో ఉన్న డబ్బులు తమ సొంత ఖాతాలకు మార్చుకుంటే డబ్బులు వస్తాయని భావించి అకౌంట్లు లో జమ అయినటువంటి ఫేక్ అమౌంట్ విత్ డ్రా చేయడానికి ప్రయత్నించగా అవి విత్ డ్రా కాలేదు. దీనికి బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయబడినవి అని తెలుసుకొని తను మోసపోవడమే కాకుండా ఇతరులు కూడా మోసపోయారని తెలుసుకొని ఎల్జి కంపెనీ ఏజెంట్లని అడిగాడు. కంపెనీ ఆపరేట్ ముంబైలో జరుగుతుందని కంపెనీ చీఫ్ రాజు అని తాము మాట్లాడుతున్నాం మీ డబ్బులు మీకు వస్తాయని కొంతకాలం నమ్మించారు. అయినప్పటికీ డబ్బులు ఖాతా లో జమ కాక పోవటంతో అతను మోసపోయానని గ్రహించి రెంజల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితులు పోలీసులకు చిక్కారు. ఎల్జీ కంపెనీలో పెట్టుబడి పెట్టినటువంటి డబ్బు విలువ సుమారు రూ. 75 లక్షల వరకు ఉంటుందని సీపీ తెలిపారు. వేస్తున్నాం ప్రస్తుతం కంపెనీకి చెందిన యాప్ పనిచేయడం లేదనీ, ప్రజలు ఎవరు ఇలాంటి మోసపూరితమైనటువంటి మల్టీ లెవెల్ మార్కెటింగ్ చైన్ సిస్టంలో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలు పొందాలని ఉద్దేశంతో పెట్టుబడులు పెట్టకూడదని, పెట్టి మోసపోకూడదని, ఇలాంటి మోసపూరిత మాటలకు ఆకర్షితులు కావద్దని, ఎవరైనా ఇట్టి కంపెనీ పేరులతో పెట్టుబడి పెట్టాలని చెబితే లోకల్ పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలను మోసం చేసిన ఏజెంట్లైన మేకల జగదీష్, పెద్ద బోయిన భూమయ్య అలియాస్ ప్రేమ్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ముంబైకి సంబంధించిన రాజు అనే వ్యక్తిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతికేలా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. సన్నబియ్యం ఇస్తున్నాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. వారిని ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. సోలార్ ప్లాంట్స్ నిర్వహణ అప్పగించాం. శిల్పారామంలో ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశాం.

- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2027 జనాభా గణనకు కేంద్రం సిద్ధం

- 30 కి పైగా ప్రశ్నలు తయారు చేసిన అధికారులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : భారతదేశ జనాభా గణన 2027లో ప్రారంభం కాబోతున్నది. సర్వేయర్లంతా ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నారు. సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు సమాచారం కోరనున్నారు. నల్లాల ద్వారా నీరు అందుతుందా? ప్యాకేజ్డ్, సీసాల నీటిని ఉపయోగిస్తారా? ఆరా తీయనున్నారు. టెలిఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల గురించిన సమాచారం కూడా సేకరించనున్నారు. దీని ఉద్దేశం దేశ ప్రజల జీవన ప్రమాణాలు అర్థం చేసుకోవడమే. డేటా అభివృద్ధి చెందిన భారత ప్రచారంలో కొత్త విధానాలను రూపొందించడంలో, ఇప్పటికే ఉన్న విధానాలలోని లోపాలను సరిదిద్దడంలో సహాయపడనున్నది. 2027 జనాభా లెక్కల తొలి దశ కోసం గృహాల జాబితా, గృహాల గణన షెడ్యూల్ జాబితాను తయారు చేసే ప్రచారాన్ని కేంద్రం ముమ్మరం చేసింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరగనుండగా, ఇందు కోసం 30కిపైగా ప్రశ్నల జాబితా సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ త్వరలో జారీ చేయనున్నారు. ఇంటి కారు, మోటార్ సైకిల్, సైకిల్, మోపెడ్ సమాచారం సేకరిస్తారు. ఇంటిలో వంట చేయడానికి ఏమి ఉపయోగిస్తున్నారు? కలప, పంట వ్యర్థాలు, పిడకలు, బొగ్గు, గోబర్ గ్యాస్, కిరసనాయిల్, ఎల్‌పీజీ, పీఎన్‌జీ, సోలార్ ఎనర్జీ ఇలా ఏం వాడుతున్నారో తెలుసుకొని రికార్డు చేయనున్నారు. టీవీ, ల్యాప్‌టాప్, ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్‌లలో డిష్, డీటీహెచ్ వినియోగిస్తున్నా ఆ సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే గోధుమ, జొన్న, బియ్యం, మిల్లెట్ , మొక్కజొన్న వాడకం గురించి కూడా ప్రశ్నలు ఉంటాయి.

విశ్వ వీక్షణం

పాక్ పారా మిలిటరీ ఆఫీసుపై ఆత్మాహుతి దాడి

- ఎదురు కాల్పులలో ముగ్గురు కమాండోలు మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : పాకిస్తాన్ లో ముష్కరులు రెచ్చిపోయారు. పెషావర్ లోని పాక్ పారామిలిటరీ ప్రధాన కార్యాలయం పై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు కమాండోలు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు దాడి చేసారని 'రాయిటర్స్' వెల్లడించింది. ఆ కార్యాలయాన్ని ముట్టడించిన ముష్కరులు వరుస దాడులు చేశారని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో అప్రమత్తమైన పారామిలిటరీ సిబ్బంది వారిపై కాల్పులు జరిపారు. ఈ ఎదురు కాల్పులలో ముగ్గురు కమాండోలు మరణించారు. పలువురు గాయపడ్డారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రధాన కార్యాలయం లోపల కొంతమంది ఉగ్రవాదులు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు, స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి.

అతిగా ఆలోచించకండి

ప్రస్తుతం మనమందరం ఉరకల పరుగుల జీవితాలు గడుపుతున్నాం. మనకున్న షెడ్యూల్ ప్రకారం మన పనులు ఎప్పటికీ పూర్తి కానివిగా మారిపోయాయి. అందుకే మనందరికీ సమయం సరిపోవడం లేదని అనిపిస్తుంది. సమస్యల గురించి ఆలోచించడానికి, నిశ్శబ్దంగా కూర్చోవడానికి, కొన్ని ప్రశాంతమైన నిమిషాలను గడపడానికి మనకు అరుదుగా సమయం ఉంటుంది. ఇది కూడా మనకు సమస్యగా మారుతుంది. ఇలా ఆలోచించడం అతిగా ఆలోచించడం అన్న విషయం చాలామందికి తెలియదు. జపనీస్ టెక్నిక్స్ ని ఉపయోగించి ఓవర్ థింకింగ్ ను అధిగమించొచ్చు.

మీ కంట్రోల్‌లో లేనిదాని గురించి ఆలోచించకండి

మనం చాలా విషయాలు మార్చేయాలని ఆరాటపడుతుంటాం. ఇది తప్పు, అది తప్పు అనుకుంటూ.. ఇవన్నీ సరిచేస్తే జీవితం బాగుంటుందని అనుకుంటాం. ఇదే అసలు సమస్య అని షోగానై టెక్నిక్ చెబుతోంది. అంటే మన కంట్రోల్ లో లేని విషయాల గురించి ఆలోచించడం అనవసరమని దీనర్థం. మీరు నియంత్రించలేని విషయాల గురించి చింతిస్తూ సమయాన్ని వృథా చేయకూడదు. మీరు ఈ విషయాన్ని ప్రభావితం చేయగలరు అనుకుంటేనే ఆ అంశం గురించి ఆలోచించాలి. మీరు ఈ ముందుచూపు ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోగలిగితే మీ జీవిత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతారు. రానున్న సమస్యలను మరింత సులువుగా పరిష్కరించుకోగలుగుతారు.

ధ్యానం చేయండి

బౌద్ధమతంలో ఒక సాధారణ ధ్యాన సాంకేతికతను జాజెన్ అని పిలుస్తారు. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తీర్పు ఇవ్వకుండా సాధన సమయంలో ఒకరి ఆలోచనలను తిరిగి ఆలోచించడం సాధ్యమవుతుంది. ఇది అతిగా ఆలోచించే అలవాటును దూరం చేయడానికి నిజంగా శక్తివంతమైన మార్గం.

ప్రకృతితో ఫ్రెండ్ షిప్ చేయండి

ఉరకల పరుగుల జీవితంలో మీరు బాగా అలసిపోయినట్లు మీకనిపిస్తోందా.. అయితే అర్జెంటుగా మీరు చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టేయండి. ఎందుకంటే ఉద్యోగం సరిగా చేయాలంటే ఏకాగ్రత చాలా అవసరం. మీ అలసట తీర్చుకోవడానికి మీకు ఇష్టమైన ప్రాంతాలకు వెళ్లండి. హిమాలయాలకో, ఊటీ, కొడైకెనాల్ లాంటి దూర ప్రాంతాలకైనా వెళ్లండి. మీకు నచ్చితే స్థానికంగా ఉన్న ప్రకృతి, పచ్చదనం చుట్టూ సమయం గడపడం ముఖ్యం. దీన్నే షిరిన్‌యోకు టెక్నిక్ అంటారు. మరింత ప్రశాంతంగా ఉండటానికి, అతిగా ఆలోచించకుండా ఉండటానికి ఈ టెక్నిక్ సహాయపడుతుంది. ఇది మానసిక ప్రశాంతతకు సహాయపడుతుంది.

ప్రశాంతత పొందండి

నెన్బుట్సు టెక్నిక్ ద్వారా మీ దృష్టిని మిమ్మల్ని అతిగా ఆలోచింపజేసే విషయాల నుండి దూరం చేయవచ్చు. ఇందులో మీరు చేయాల్సింది ఏంటంటే బుద్ధుని పేరును జపించాలి. లేదా మీకు ఇష్టమైన దైవాన్ని, ఆయన పేరును జపించాలి. ఈ విధంగా ఇది మీ మనస్సుకు ప్రశాంతతను కలిగిస్తుంది. అంతే కాకుండా మీ చర్యలు, భావోద్వేగాల గురించి తెలుసుకోవడానికి ఒక గొప్ప మార్గంగా ఉపయోగపడుతుంది.

జీవితంలో ఏదీ శాశ్వతం కాదని తెలుసుకోండి

ఈ జపనీస్ పద్ధతి జీవితంలో ఏదీ శాశ్వతం కాదని, విషయాలు ఎల్లప్పుడూ ఆదర్శంగా ఉండవని మీరు అర్థం చేసుకోవాలి. ఈ రెండు వాస్తవాలను మీరు అంగీకరించగలిగిన వెంటనే పరిపూర్ణతను సాధించాలనే కోరిక తగ్గడం ప్రారంభమవుతుంది. ఇది మీ ఆందోళనను బాగా తగ్గించి, మిమ్మల్ని మరింత ప్రశాంతంగా అనుభూతి చెందేలా చేస్తుంది.

నెగెటివ్ వైబ్రేషన్స్ దూరం చేయండి

గమన్ టెక్నిక్ ఏంటంటే.. మీ ఆలోచనల్లో వచ్చే నెగెటివ్ వైబ్రేషన్స్ మిమ్మల్ని బాధించనివ్వకుండా ఉండటానికి మీకు మీరే సెల్ఫ్ టీచింగ్ చేసుకోవడం. జీవితంలోని అనూహ్య మలుపులను ఎదుర్కొంటూ ముందుకు సాగడం అందరూ చేయాల్సిన పని. దీనికి అనుగుణంగా మీ బలాన్ని, స్థితిస్థాపకతను కాపాడుకోవడం ముఖ్యం. ఒక సమయంలో ఒక అడుగు వేయడంపై దృష్టి పెట్టడం ఆదర్శవంతమైన విధానం. గమన్ టెక్నిక్ చెప్పేది అదే.

పువ్వులను ఒక క్రమంలో అమర్చండి

ఈ పద్ధతి ఆసక్తికరంగా ఉంటుంది. ఈ టెక్నిక్ లో మీరు శ్రద్ధ, చిత్త శుద్ధితో పువ్వులను అమర్చాలి. అందమైన వాటిని సృష్టించడంలో మీ మనస్సు మునిగిపోయినప్పుడు, మీ మనస్సు ఎంత త్వరగా బాధించే ఆలోచనలపై దృష్టి పెట్టడం మానేస్తుందో మీరు ప్రాక్టికల్ గా చూస్తారు.

అకస్మాత్తుగా తగ్గిన బంగారం ధరలు

- పసిడి ప్రియులకు లభించిన ఊరట

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 24 : పసిడి ప్రియులకు ఈ సోమవారం పండుగలాంటిదే. బంగారం కొనాలని చూస్తున్న వారికి ఇది ఒక గొప్ప విషయమే. మార్కెట్లు తెరుచున్న వెంటనే బంగారం ధర భారీగా తగ్గింది. 24 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాముపై 71 రూపాయలు, 22క్యారెట్ల బంగారం ఒక గ్రాముపై 65 రూపాయలు, 18 క్యారెట్ల బంగారం ఒక గ్రాము 53 రూపాయల చొప్పున దిగివచ్చింది. దీంతో దేశీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ. 1,25,130 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాము రూ. 1,14,700 పలుకుతుండగా, 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ. 93850 లకు చేరింది. గోల్డ్ లవర్స్‌కి తగ్గిన ధరలు నిజంగానే కాస్త ఊరటనిస్తాయని చెప్పాలి. ఇదిలా ఉంటే, పసిడి బాటలో వెండి కూడా పయనించింది.

వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. వెండి గ్రాము ధర రూపాయి తగ్గి రూ.171లకు చేరింది. దీంతో కేజీ వెండి ధర రూ.1,71,000 ధర పలుకుతోంది.నవంబర్ 24 సోమవారం హైదరాబాద్ సహా విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర తులానికి రూ.710 తగ్గి రూ.1,25,130 పలుకుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.650 తగ్గింది. దీంతో 10గ్రాముల ధర రూ.1,14,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.530 తగ్గి రూ.93,850 పలుకుతోంది.

అమెరికాలో భారత వస్తువులకే డిమాండ్

- ఎందుకూ పనిచేయని ట్రంప్ సుంకాలు, ఆదేశాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ తన పరిపాలనలో భారత్‌ను పూర్తిగా శత్రుదేశంగా పరిగణిస్తున్నారు. తను చెప్పినట్లు వినాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. వినలేదన్న కోపంతో భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే భారత ఎగుమతులపై 50 శాతం టారిఫ్ విధించారు. దీంతో అమెరికాలో భారతీయ వస్తువులకు డిమాండ్ తగ్గుతుందని భావించారు. కానీ, ట్రంప్‌ను అమెరికన్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. మన వస్తువులనే అమెరికన్లు ఎక్కువగా నమ్ముతున్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా మన వస్తువుల ధరలు పెరిగినా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. భారత్‌ను దెబ్బతీయాలని ట్రంప్ భావిస్తుంటే, అమెరికన్లు మాత్రం మన సరుకులనే ఆదరిస్తున్నారు. మన వస్తువులే కావాలని వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో టారిఫ్ కారణంగా దిగుమతులు తగ్గించిన వ్యాపారులు కూడా క్రమంగా మన సరుకుల దిగుమతి పెంచుతున్నారు. ఇక భారతీయ వర్కర్ల స్థానంలో అమెరికన్లను నియమించుకోవాలని ట్రంప్ ఆదేశించారు. కానీ, ట్రంప్ ఆదేశాలను ఎవ్వరూ పాటించడం లేదు. అమెరికా వర్కర్లను పెట్టుకుంటే వేతనం ఎక్కువ. వారు పని చేయడానికి ఇష్టపడరు. అందుకే, వ్యాపారులు థర్డ్ పార్టీ విధానం ఎంచుకుని ట్రంప్‌కు షాక్ ఇచ్చారు.ఇక భారతీయ వస్తువులకు అమెరికాలో ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది.

ఇప్పుడిప్పుడే దారికొస్తున్న బంగ్లాదేశ్

- భారత్ సాయం లేకుండా మనుగడ ఎలా!

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 24 : మన పొరుగున ఉన్న ఇస్లామిక్ దేశం బంగ్లాదేశ్. భారత్‌తో యేడాది క్రితం వరకు సత్సంబంధాలు కొనసాగించింది. అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత కొత్తగా ఏర్పాడిన మహ్మద్ యూనస్ ప్రభుత్వం భారత వ్యతిరేక ధోరణి అవలంబిస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ ఆసియాలో ప్రాముఖ్యత ఎక్కువగా కలిగిన చికెన్స్ నెక్ (సిరిగుడి కారిడార్) ను పాకిస్తాన్, చైనాతో కలిసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోంది. నాలుగు వేల కిమీపైగా సరిహద్దులు కలిగిన బంగ్లాదేశ్‌కు భారత్ సాంప్రదాయకంగా ముఖ్యమైన భాగం. కొన్ని రోజులుగా బంగ్లాదేశ్ పాకిస్తాన్, చైనా సహకారంతో చికెన్స్ నెక్‌ను ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ అంశం దక్షిణ ఆసియాలో సాంకేతిక, విదేశాంగ పనితీరు మరింత క్లిష్టతను తెస్తే, భారత్ రెండు వైపులా ప్రక్కనే ఉన్న బంగ్లాదేశ్‌కు తెరువునిచ్చి, మైత్రి బలపరచడంలో ఆసక్తి చూపుతోంది. బంగ్లాదేశ్ స్వంత స్వాభావిక, ఆర్థిక అవసరాల కోసం భారతదేశంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. చైనా, పాకిస్తాన్ సహకార ఉన్నప్పటికీ, ఉత్పాదకత, రవాణా, నీటి వినియోగాల క్రమం చూస్తే భారత్‌తో సహకారం తప్పనిసరిగా కొనసాగించడం అవసరం. ఝార్ఖండ్ స్విచ్‌లు, నీటి వినియోగం వంటి అంశాలు బంగ్లాదేశ్‌లో కరువు, వరదల నివారణకు భారత సహాయాన్ని కోరుతాయి. ఇప్పుడు అజిత్ ధోవల్‌ను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తున్నారు.



భారత జట్టు నాశనానికి గంభీరే కారణం

- అతడిని వెంటనే కోచ్ బాధ్యతల నుంచి తప్పించండి

సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్టు సిరీస్ లో టీమిండియా పేలవ ప్రదర్శన చేస్తోంది. దీంతో అభిమానులు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై మండిపడుతున్నారు. అతడిని వెంటనే తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంభీర్‌ను మారిస్తేగానీ జట్టు బాగుపడదంటున్నారు. గౌహతిలో జరుగుతున్న రెండో టెస్ట్‌లో భారత బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌతాఫ్రికా 489 పరుగుల భారీ స్కోర్ చేసినప్పటికీ, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే చేతులెత్తేసింది. యశస్వి జైస్వాల్ 58, సుందర్ 48 మినహా మిగతావారెవరూ రాణించలేదు. కేఎల్ రాహుల్ 22, సాయి సుదర్శన్ 15, ధ్రువ్ జురెల్ 0, రిషభ్ పంత్ 7, నితీశ్ కుమార్ రెడ్డి 10, జడేజా 6 పరుగులే చేయగలిగారు. కనీసం ఫాలో ఆన్ స్కోర్ కూడా చేయకపోవడం మీద అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గౌతమ్ గంభీర్ తీరే ఇందుకు కారణమని మండిపడుతున్నారు. పిచ్చి పిచ్చి ప్రయోగాలతో జట్టును నాశనం చేశాడని, ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసాడని అంటున్నారు. బాగా ఆడుతున్న సర్ఫరాజ్ ఖాన్, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్ వంటివారిని కాదని సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ వంటివారిని తీసుకోవడమే ఇందుకు కారణమని మండిపడుతున్నారు. గంభీర్ వచ్చినప్పటి నుంచీ జట్టుకు ఘోర పరాజయాలు తప్పడం లేదంటున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ జట్టు నుంచి తప్పుకునేలా చేసాడని, షమీని ఎంపిక చేయకుండా జట్టును నాశనం చేస్తున్నాడను అభిప్రాయాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.



ప్రతిపక్షం
Prathipaksham.in
12
హైదరాబాద్
మంగళవారం
25.11.2025
సినిమా

టీమిండియా ముందు భారీ లక్ష్యం!

- రెండో టెస్టులో ధాటిగా ఆడుతున్న సౌతాఫ్రికా

టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా జోరు కొనసాగిస్తోంది. భారత్ ఘోర పరాజయం దిశగా సాగుతోంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈ మ్యాచ్‌లో గెలిచే పరిస్థితి లేదు. మూడో రోజు 288 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 26 పరుగులు చేసింది. ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (13), ఎయిడెన్ మార్‌క్రమ్(12) పరుగులతో ఆడుతున్నారు. అంతకుముందు టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ 58, వాషింగ్టన్ సుందర్ 48 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు రాణించలేదు. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్(15), ధ్రువ్ జురెల్(0), రిషభ్ పంత్ (7), నితీశ్ కుమార్ రెడ్డి (10), రవీంద్ర జడేజా(6) పరుగులు చేశారు. కుల్దీప్ యాదవ్ కలిసి వాషింగ్టన్ సుందర్ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగులు జోడించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ ఆరు వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశాడు. సిమన్ హర్మర్ మూడు వికెట్లు పడగొట్టాడు. కేశవ్ మహరాజ్‌కు ఒక వికెట్ దక్కింది. 9/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన భారత్ వరుసగా నాలుగు వికెట్లు కోల్పోయింది. రెండో సెషన్‌లోనూ 122 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. కానీ, సుందర్, కుల్దీప్ వీరోచితంగా జట్టును ఆదుకున్నారు. చివరకు ఆఖరి సుందర్ ఔటవ్వడంతో భారత్ గాడి తప్పింది. సిరాజ్ సాయంతో బుమ్రా జట్టు స్కోర్‌ను 200 పరుగుల మార్క్‌ను దాటించాడు. సౌతాఫ్రికా ఫాలో ఆన్ ఆడించకుండా బ్యాటింగ్‌కు దిగింది. ప్రస్తుతం సౌతాఫ్రికా 314 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వారిద్దరూ ప్రపంచ కప్ ఆడి తీరాల్సిందే!

- సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్

భారత సీనియర్ బ్యాటర్లు విరాట్, రోహిత్ టీ20లు, టెస్టుల నుంచి తప్పుకుని చాలా కాలం అవుతున్నప్పటికీ వారి భవిష్యత్తు మీద క్రికెట్ ప్రపంచంలో చర్చలు ఆగడం లేదు. 2027 వన్డే వరల్డ్‌కప్ నాటికి వీరిద్దరూ జట్టులో ఉంటారా? లేక తప్పిస్తారా? అనే సందేహాలు ఇప్పటికీ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రోహిత్, కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడాలని, వారి అవసరం భారత్ కు చాలా ఉందని అన్నాడు. రోహిత్, కోహ్లీకి ఉన్న అనుభవం, మానసిక దృఢత్వం వెల కట్టలేనివని కూడా పేర్కొన్నాడు. వరల్డ్‌కప్ లాంటి మెగా టోర్నీలలో టాలెంట్ మాత్రమే ఉంటే సరిపోదని, ఒత్తిడి తట్టుకునే మానసిక శక్తి కూడా కావాలన్నాడు. అది వీరిద్దరి దగ్గర పుష్కలంగా ఉంది కాబట్టి 2027 వరల్డ్ కప్‌లో వీరు ఆడడమే సబబని అన్నాడు. 'గతంలో సచిన్, ధోనీ విషయంలో ఎప్పుడు రిటైర్ కావాలనే విషయంలో చర్చ జరిగింది. ఎప్పుడు రిటైర్ అవ్వాలి? ఎప్పుడు ఆడాలి? అనేది పూర్తిగా క్రీడాకారుల ఇష్టం' రోడ్స్ స్పష్టం చేశాడు. రోహిత్, కోహ్లీ ఇంకా పరుగులు సాధిస్తున్నందున వారిని ఆడించడమే సరైందన్నాడు. రోహిత్, కోహ్లీ మే నెలలో రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం వన్డేలలోనే ఆడుతున్నారు.



వైజాగ్ మూడో వన్డేకు భలే డిమాండ్

- 27 వేల టిక్కెట్లు ఆన్ లైన్ లో అమ్మకానికి

సౌతాఫ్రికాతో టీమిండియా ఆడనున్న మూడో వన్డే వైజాగ్ లో జరుగనుంది. డిసెంబర్ ఆరున జరిగే మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఇక్కడ జరుగుతున్న వన్డే మ్యాచులో రోహిత్, విరాట్ ఆడనుండడంతో ఈ మ్యాచ్‌కు విపరీతమైన క్రేజ్ నెలకొంది. టికెట్లకు కూడా భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ మైదానం సామర్థ్యం 27,500 కాగా, 22 వేల టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారు. 28 నుంచి జొమాటో యాప్ ద్వారా సేల్ చేయనున్నారు. రూ.1200, రూ. 2000, రూ.2500, రూ.3000, రూ.3500, రూ.4000, రూ.5000, రూ. 10000, రూ.15000, రూ. 18000 ధరలలో టికెట్లు అందుబాటులో ఉన్నాయి. 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలవుతుంది. డిసెంబర్ మూడున రాయ్‌పూర్ లో రెండో వన్డే జరగనుంది. అటు బీసీసీఐ ఇప్పటికే 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. గిల్, అయ్యర్ గాయాలతో ఈ సిరీస్‌కు దూరం కావడంతో కేఎల్ రాహుల్ సారథ్యం వహించనున్నాడు. టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లకు విశ్రాంతిని ఇచ్చారు. పాండ్యాను కూడా ఎంపిక చేయలేదు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా ఆడుతున్న రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మకు కూడా వన్డే జట్టులోకి వచ్చారు. అక్షర్ పటేల్ స్థానంలో రవీంద్ర జడేజాను తీసుకున్నారు. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, నితీశ్ కుమార్ రెడ్డికి జట్టులో చోటు దక్కింది.

చికిరి చికిరి @100 మిలియన్ వ్యూస్

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ భారీ పాన్‌ఇండియా మూవీ పెద్ది నుండి ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి సాంగ్ ప్రపంచవ్యాప్తంగా ఒక వేడుకగా మార్చింది. విడుదలైన నిమిషం నుండే ఈ పాట ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను అదరగొట్టింది. అకాడమీ అవార్డు విన్నర్ ఏ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన చికిరి చికిరి ఖండాలలో ప్రతిధ్వనించింది. భాషా సరిహద్దులను అప్రయత్నంగా దాటింది. వైరల్ బీట్‌లు, జానపదమూలాలున్న పల్స్, సినిమాటిక్ సౌండ్‌స్కేప్ ప్రపంచంలోని ప్రతి మూల నుండి శ్రోతలను అలరించాయి. అన్ని భాషల్లో సాంగ్ 100+ మిలియన్ల వ్యూస్ ని క్రాస్ చేసింది. తెలుగు వెర్షన్ సాంగ్ ముందంజలో ఉంది. దాదాపు 64 మిలియన్ వ్యూస్, 1 మిలియన్‌కు చేరువైన లైకులతో దూసుకెళ్తూ, రామ్‌చరణ్ అసమానమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించింది. హిందీ వెర్షన్ కూడా 25 మిలియన్ వ్యూస్‌తో బలంగా నిలవగా, తమిళ్, కన్నడ, మలయాళం వెర్షన్లు కలిపి మరో 10 మిలియన్ వ్యూస్‌ను యాడ్ చేశాయి. దీంతో ఈ పాట పాన్‌ఇండియా స్థాయిలో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సంచలనానికి అసలు హైప్ తెచ్చింది రామ్‌చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్, అద్భుతమైన డాన్స్ స్కిల్స్, మ్యాగ్నెటిక్ ఆరా. ఈ పాటలో రా, రస్టిక్‌గా పవర్ ఫుల్ గ్రేస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఆయన స్టెప్స్‌ను వేలాది మంది అభిమానులు రీక్రియేట్ చేస్తుండగా, సోషల్ మీడియాలో చికిరి ఫెస్టివల్ కొనసాగుతోంది. హై ఎనర్జీ డాన్స్ రీల్స్ నుంచి స్టైలిష్ ఎడిట్స్, ఫ్యాన్ ట్రిబ్యూట్స్ వరకూ టైమ్‌లైన్లు నిండిపోతున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న పెద్ది విడుదలకు ముందే భారీ హైప్ సృష్టించింది. తొలి సింగిల్‌నే గ్లోబల్ చార్ట్‌బస్టర్‌గా మారడంతో, సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్ని తాకాయి. రాబోయే ఏడాది పెద్ది బిగ్గెస్ట్ గ్లోబల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

#పూరిసేతుపతి షూటింగ్ పూర్తి

వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ క్రేజీ కాంబినేషన్‌లో మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ #పూరిసేతుపతి షూటింగ్ పూర్తయింది. ఇంటెన్స్ మాస్‌యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రారంభమైన ఈ చిత్రం చిత్రీకరణ చివరి రోజు పూరి, విజయ్ సేతుపతి, చార్మీ కౌర్ మధ్య ఎమోషనల్ మూమెంట్స్ కి సంబధించిన వీడియోను టీం విడుదల చేసింది వీడియోలో, పూరి, మొత్తం యూనిట్ తో కలిసి పనిచేయడాన్ని తాను ఎంతగా మిస్ అవుతున్నానో విజయ్ సేతుపతి తెలియజేస్తూ, ఈ ప్రయాణాన్ని మెమరబుల్, ఆనందకరమైన అనుభవంగా చెప్పారు. పూరి, చార్మీ తమ భావాలను పంచుకున్నారు. షూటింగ్ సమయంలో ఏర్పడిన బాండింగ్ ని తెలియజేశారు. విజయ్, పూరి జాకెట్ చాలా బావుందని అభినందించడం ఫేర్ వెల్ కు ఫన్ టచ్ ని జోడించింది. ఈ చిత్రాన్ని జెబి మోషన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు, దునియా విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొత్తం షూటింగ్ పూర్తయినందున, చిత్ర బృందం ప్రమోషన్‌లను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో విడుదలకు సిద్ధమవుతున్నందున ఈ సిమిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ త్వరలో రిలీజ్ చేయనున్నారు.

'ఆంధ్ర కింగ్ తాలూకా' లాంటి సినిమా ఇప్పటివరకూ రాలేదు

డైరెక్టర్ మహేశ్ బాబు పి

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా' తో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. . ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మహేశ్ బాబు పి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ సినిమాకి ఆంధ్ర కింగ్ తాలూకా అనే టైటిల్ పెట్టడానికి కారణం ?

ఈ టైటిల్ కి చాలా మీనింగ్ ఉంది. అది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థమవుతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి బయటకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా 2002 టైం లో జరుగుతుంది. అప్పుడు రెండు రాష్ట్రాలు కలిసి ఉండేవి. కాబట్టి అలా పెట్టడం జరిగింది. కన్నడలో కూడా ఈ సినిమాని అదే టైటిల్తో రిలీజ్ చేస్తున్నాం. .

ఆంధ్ర కింగ్ క్యారెక్టర్ కోసం ఉపేంద్ర ని తీసుకోవడానికి కారణం?

రానా ఉపేంద్ర తో ఒక ఇంటర్వ్యూ చేయడం చూశాను. అందులో ఉపేంద్ర 'నేను బయటకంటే సినిమాలోనే రియల్ మనిషి' అని చెప్పారు. ఆ మాట నాకు చాలా కనెక్ట్ అయింది. అప్పుడే సూర్య అనే క్యారెక్టర్ ఇలా ఉంటుంది అనిపించింది. సూర్య పాత్ర కోసం మేము ఆయన్నే సంప్రదించాము. ఉపేంద్ర గారికి హార్డ్ కోర్ ఫ్యాన్స్ ఉన్నారు. సూర్యలో అందరు స్టార్స్ కనిపిస్తారు.

ఇది ఫ్యాన్ బయోపిక్ అన్నారు కదా మీకు అలా ఇన్స్పైర్ చేసిన ఫ్యాన్స్ ఎవరైనా ఉన్నారా?

ఒక్క పర్సన్, ఇన్సిడెంట్ అని చెప్పలేను. చాలా రోజుల క్రితం ఒక సినిమాకి వెళ్లాను. ఆ సినిమా నాకు అంతగా నచ్చలేదు. కానీ నా పక్కన ఉన్న ప్రేక్షకుడు ఆ డైలాగులకు చాలా ఇన్స్పైర్ అవుతున్నాడు. ప్రతి డైలాగ్ కి కనెక్ట్ అవుతున్నాడు, నిజానికి అక్కడ ఉన్న హీరోతో తనకి పర్సనల్గా ఎటువంటి కనెక్షన్ ఉండదు. కానీ తను చెప్పే ప్రతి మాటకి ఇన్స్పైర్ అవడం అనేది నాకు చాలా కనెక్టింగ్ గా అనిపించింది. అలాంటి కథని ఎవరూ చెప్పలేదనిపించింది. సౌత్ ఇండియాలో హీరోస్ ని మన జీవితంలో ఒక అంతర్భాగంగా చూస్తాం. అందులో నాకు చాలా ఎమోషన్స్ కనిపించాయి. అలా ఆ ఇద్దరి రిలేషన్ లో ఒక కథ చెప్పొచ్చు అనిపించింది. ఫ్యాన్ ని ఆధారంగా చేసుకుని కొన్ని సినిమాల్లో వచ్చాయి కానీ ఇలాంటి కథతో సినిమా ఇప్పటివరకు సినిమా రాలేదు. ఇందులో నేను చెబుతున్న కథ కంప్లీట్ డిఫరెంట్, చాలా యూనిక్.

ఈ కథ రామ్ కి చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ ఏమిటి?

మైత్రి మూవీ మేకర్స్ కి ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎక్సైట్ అయ్యారు. రామ్ గారు అప్పటికే చాలా పెద్ద స్టార్ డైరెక్టర్స్ తో వర్క్ చేశారు. నేను ఒక సినిమా మాత్రమే చేసిన దర్శకుడిని. ఆయన కాల్ చేసి 20 నిమిషాల్లో కథ చెప్పగలవా అని అన్నారు. నేను అప్పటికే పూర్తి కథని రాసుకున్నాను. ఆయనకి ఏది చెప్పాలి ఏది చెప్పకూడదని రాత్రంతా ఆలోచించాను. ఆయనకి కలిసి కథ చెప్పాను. పూర్తి కథ విన్నారు. తర్వాత మైత్రి మూవీ మేకర్స్ నుంచి నాకు కాల్ వచ్చింది. 'ఆయన ఫస్ట్ సిట్టింగ్లో ఓకే చేసిన కథ ఇదే' అని చెప్పారు. చాలా ఆనందంగా అనిపించింది

ఈ సినిమాలో ఫ్యాన్ బాయ్ గా రామ్ ని ఎంచుకోవడానికి కారణం?

రామ్ చాలా వెర్సటైల్ యాక్టర్. ఆయన క్యారెక్టర్ లో పెర్ఫార్మెన్స్ లో చాలా ఎనర్జీ ఉంటుంది . నేను రాసుకున్న పాత్రకి గొప్ప ఎనర్జీ కావాలి. ఒక ఫ్యాన్ ఎలా బిహేవ్ చేస్తాడో ఎంత మాస్ గా ఉంటాడో అలాంటి పెర్ఫార్మర్ కావాలి. ఇలాంటి క్యారెక్టర్ కి రామ్ గారు పర్ఫెక్ట్. ఈ సినిమాకి నేను రామ్ అద్భుతమైన వేవ్ లెంత్ లో వర్క్ చేసాం. ఇద్దరం ఒకటే అన్నట్టుగా పని చేసాం. ఇప్పటివరకు రామ్ చేసిన సినిమాలు వేరు.. ఈ సినిమా వేరు.

భాగ్యశ్రీ పాత్ర ఎలా ఉంటుంది?

భాగ్యశ్రీ పాత్ర ఈ కథలో చాలా కీలకం. ఒక జీవితాన్ని చూసినట్టుగా ఉంటుంది. మురళీ శర్మగారు ,రావు రమేష్‌గారు సత్య, రాహుల్ రామకృష్ణ ఇలా ఇందులో ఉండే ప్రతి క్యారెక్టర్ ఒక ఎమోషన్ తో ఉంటుంది.

రామ్ ఈ సినిమాలో పాటలు రాయడం ఎలా అనిపించింది?

నిజంగా రామ్ కి పాటలు రాసే టాలెంట్ ఉందని నాకు తెలియదు. ఆయనకి మ్యూజిక్ పట్ల విపరీతమైన నాలెడ్జ్. మ్యూజిక్ సిట్టింగ్ కి కంపల్సరిగా వస్తారు. ఒక ట్యూన్ గురించి డిస్కస్ చేస్తున్నప్పుడు అందులో ఉన్న ఎమోషన్ ని ఆయనే మాటలు రూపంలో చెప్పారు. అది నాకు చాలా నచ్చింది . తర్వాత పల్లవి కూడా రాశారు. అది మాకు అన్ని విధాలుగా ప్లస్ అయింది.

కొత్తగా చేయబోతున్న సినిమాలు గురించి?

కొన్ని కథలు ఉన్నాయి. చర్చిస్తున్నాము. ఈ సినిమా రిలీజ్ అయ్యాక వాటి మీద వర్క్ చేస్తాను.



'ద్రౌపది 2' ఫస్ట్ లుక్

రక్షణ ఇందుచూడన్ పోస్టర్ రిలీజ్

నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ల మీద రిచర్డ్ రిషి హీరోగా సోల చక్రవర్తి నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ద్రౌపది 2'. ఈ మూవీని మోహన్. జి తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. హీరోయిన్ రక్షణ ఇందుచూడన్ పోషిస్తున్న ద్రౌపది దేవీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ద్రౌపది దేవిగా రక్షణ ఎంతో గాంభీర్యంగా, ఎంతో హుందాగా కనిపిస్తున్నారు. ఆమె కట్టూబొట్టూ, ఆహార్యం ఇలా అన్నీ కూడా మెప్పించేలా ఉన్నాయి. వెనకాల బ్యాక్ గ్రౌండ్‌లో ఉన్న సెట్ వర్క్‌ని చూస్తుంటే సినిమా స్కేల్ ఏంటో అర్థం అవుతోంది. భారీ బడ్జెట్‌తో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత గొప్పగా ఈ మూవీని నిర్మిస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసుకుని సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి ఫిలిప్ ఆర్ సుందర్ కెమెరామెన్‌గా, దేవరాజ్ ఎస్ ఎడిటర్‌గా, ఎస్ కే ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇక పోరాట సన్నివేశాల్ని యాక్షన్ సంతోష్ భారీ ఎత్తున కంపోజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200